ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
కృష్ణా జిల్లా వార్తలు
ఆదివారం 5 అక్టోబరు 2025


క్యూలైన్లలో భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రికి భవానీలు పోటెత్తారు. ఉత్తరాంధ్ర నుంచి భారీగా తరలిరావడంతో నగరం ఎరుపెక్కింది. ప్రకాశం బ్యారేజీ చుట్టుపక్కల ఎటుచూసినా భవానీల సందడే కనిపించింది. క్యూలైన్లు, హోల్డింగ్ పాయింట్లు కిక్కిరిసిపోయాయి. రాత్రి ఏడు గంటల సమయానికి 1.50 లక్షల మంది కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. భక్తులను కంట్రోల్ చేసేందుకు అధికారులు హోల్డింగ్ పాయింట్లను ఇంకా కొనసాగిస్తున్నారు. శనివారం అమ్మవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య రెండు లక్షలు దాటొచ్చని అంచనా వేస్తున్నారు.

అరుణవర్ణం

ఇంద్రకీలాద్రిపై పోటెత్తిన భవానీలు

ఉత్తరాంధ్ర నుంచి భారీగా రాక

- రాత్రి ఏడు గంటలకు 1.50 లక్షల మందికి దుర్గమ్మ దర్శనం
- కిక్కిరిసిన క్యూలైన్లు
- కొనసాగుతున్న హోల్డింగ్ పాయింట్లు

కనకదుర్గా నగర్‌లో భక్తజన సందోహం




ఇరుముడితో ఇంద్రకీలాద్రికి వస్తున్న భవానీలు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): ఇంద్రకీలాద్రికి భవానీల తాకిడి శనివారం కొనసాగింది. తెలుగు రాష్ట్రాల నుంచి లక్షల్లో విజయవాడకు చేరుకుంటున్నారు. ఏటా భవానీలు ఉత్తరాంధ్ర నుంచి అధికంగా వస్తుంటారు. ఈసారి కూడా అదే ఒరవడి కొనసాగుతోంది. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిసిన రెండో రోజున హోల్డింగ్ పాయింట్లను ఉపయోగించాల్సి వచ్చింది. దీంతో భవానీల రద్దీ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. క్యూలు నిండిన తర్వాత తోపులాట లేకుండా చేయడానికి అధికారులు రెండు హోల్డింగ్ పాయింట్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. శనివారం తెల్లవారుజామున మూడు గంటలకు నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. శుక్రవారం రాత్రి 12 గంటల వరకు దర్శనానికి భక్తులను అనుమతించారు. ఆ తర్వాత ఆపేశారు. దర్శనానికి బ్రేక్ వచ్చే సరికి బయట హోల్డింగ్ పాయింట్లలో భక్తుల రద్దీ పెరుగుతోంది. భక్తులందరినీ క్యూల్లో నుంచి పంపితే దర్శనం మరింత జాప్యమవుతుందని భావించిన పోలీసులు టోల్‌గేట్ వద్ద నుంచి ఘాట్ రోడ్డు మీదుగా కొంతమందిని పంపుతున్నారు. టోల్‌గేట్ గోపురం వద్ద ఉన్న క్యూలైన్‌కు అత్యవసర ద్వారం ఉంది. దాన్ని తెరిచి 100 మంది చొప్పున భక్తులను ఘాట్ రోడ్డు మీదుగా పైకి పంపుతున్నారు. ఓం మలుపునకు ముందున్న క్యూలైన్ వద్ద ఉన్న అత్యవసరం ప్రదేశ ద్వారం నుంచి వారిని క్యూలోకి పంపుతున్నారు. ఇంద్రకీలాద్రి రాజగోపురం వద్ద వీఐపీ, ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వారు దర్శనానికి వెళ్లే మార్గాల్లో భవానీలను వదులుతున్నారు. ఈవిధంగా క్యూలైన్లను ఖాళీ చేయించే విధానాలను మిగతా 6లో..

శాస్త్రోక్తంగా పూర్ణాహుతి

- వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో చివరి ఘట్టం
- హాజరైన సీపీ రాజశేఖర్‌బాబు

ముగిసిన దసరా ఉత్సవాలు

వన్‌టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం శాస్త్రోక్తంగా పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ గురుప్రసాద్ దంపతులు హోమం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖర్‌బాబు దంపతులు మిగతా 6లో..


వన్‌టౌన్ స్టేషన్‌లో పూర్ణాహుతి నిర్వహిస్తున్న సీఐ గురుప్రసాద్ దంపతులు

ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, రాంప్రసాద్ రెడ్డి, సత్యకుమార్, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే బొండా ఉమా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కలెక్టర్ లక్ష్మీశ



అండగా..

విజయవాడలో ఘనంగా ఆటో డ్రైవర్ల సేవ ప్రారంభం

ఉమ్మడి కృష్ణాజిల్లాలో 27,721 మంది లబ్ధిదారులకు రూ.41.57 కోట్ల లబ్ధి

- ఆటో రిక్షా, మ్యాక్సీ, మోటార్ క్యాబ్ డ్రైవర్ల కుటుంబాల్లో వెల్లివిరిసిన ఆనందం
- ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని సీఎం చంద్రబాబు భరోసా
- ఎలక్ట్రికల్ ఆటోలకు ప్రోత్సాహం



ఆటో రిక్షా డ్రైవర్ల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆటో డ్రైవర్ల సేవ పేరుతో ఆటో రిక్షా, మ్యాక్సీ, మోటార్ క్యాబ్ డ్రైవర్లకు ఏటా రూ.15 వేలు ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. తొలి ఏడాది నగదు పంపిణీ కార్యక్రమాన్ని శనివారం అంగరంగ వైభవంగా విజయవాడలో ప్రారంభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ తదితరులు ఆటోల్లో ప్రయాణించి ఆటో డ్రైవర్ల సేవను ఆరంభించారు. ఆయా కుటుంబాల్లో ఆనందం నింపారు. ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో ఎలక్ట్రికల్ ఆటోలకు ప్రోత్సాహం అందిస్తానని చెప్పారు. తమ కష్టాలు అర్థం చేసుకుని అడగకుండానే వరాన్ని ప్రసాదించిన చంద్రన్నకు రుణపడి ఉంటామని ఆటో డ్రైవర్లు ఆనంద భాష్పాలు రాల్చారు. 6

ఆటో డ్రైవర్ల సేవ కార్యక్రమానికి హాజరైన ఆటో డ్రైవర్లు



పామర్రు-దిగమర్రు జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న కొమరవోలు గ్రామస్థులు



లైంగిక వేధింపులు భరించలేక

వివాహిత ఆత్మహత్య

మృతదేహంతో కుటుంబ సభ్యుల రాస్తారోకో

పామర్రు మండలం కొమరవోలు గ్రామంలో ఘటన


ఆత్మహత్యకు పాల్పడిన వివాహిత మేడపాటి వసంత

పామర్రు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన పామర్రు మండలం కొమరవోలు గ్రామంలో జరిగింది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం... కొమరవోలు ఎస్సీ కాలనీకి చెందిన కౌలురైతు మేడపాటి ప్రవీణ్ భార్య వసంత (25)పై అదే గ్రామానికి చెందిన మెరుగుమాల పవన్ కన్నేశాడు. లైంగికంగా వేధించడం మొదలు పెట్టాడు. వేధింపులు భరించలేక వసంత కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు పెద్దల సమక్షంలో పంచాయితీ మిగతా 6లో..

నిందితుడిని అరెస్టు చేయాలని రాస్తారోకో

లైంగిక వేధింపులకు పాల్పడిన పవన్‌ను వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ వసంత మృతదేహంతో కుటుంబ సభ్యులు, బంధువులు కొమరవోలు గ్రామంలో పామర్రు-దిగమర్రు జాతీయ రహదారిపై దాదాపు 40 నిమిషాల పాటు రాస్తారోకో చేశారు. సమాచారం అందుకున్న సీఐ సుభాకర్, ఎస్సై రాజేంద్ర ప్రసాద్ గ్రామానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చలు జరిపారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం వసంత మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలించారు.

₹16.97 కోట్ల లబ్ధి

ఆటో రిక్షా, మ్యాక్సీ, మోటార్ క్యాబ్ డ్రైవర్లకు ప్రభుత్వ సాయం

జిల్లాలో ఆటో డ్రైవర్ల సేవ లబ్ధిదారుల సంఖ్య 11,316

- కలెక్టర్ బాలాజీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల చేతుల మీదుగా చెక్కు అందజేత
- జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణంలో ఆటో డ్రైవర్ల సేవ నిర్వహణ

ఆటో డ్రైవర్ల సేవ పథకం జిల్లాలో శనివారం ఘనంగా ప్రారంభమైంది. 11,316 మంది ఆటో రిక్షా, మ్యాక్సీ, మోటార్ క్యాబ్ డ్రైవర్లకు ప్రభుత్వం రూ.16.97 కోట్లు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా గుడివాడ, గన్నవరం, పోరంకి తదితర చోట్ల ఆటో డ్రైవర్లు భారీ ర్యాలీ నిర్వహించి తమ ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, యార్లగడ్డ వెంకట్రావు, బోడె ప్రసాద్ తదితరులు ఆటో నడిపి డ్రైవర్లలో ఉత్సాహం నింపారు. ఆటోవాలాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.


ఆటో డ్రైవర్లకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ బాలాజీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు తదితరులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: ఆటో రిక్షా, మ్యాక్సీ, మోటార్ క్యాబ్ డ్రైవర్లకు ప్రభుత్వం అండగా నిలిచింది. ఒక్కొక్కరికి సంవత్సరానికి రూ.15 వేలు ఇవ్వడానికి ముందుకు వచ్చింది. తొలి విడత నగదును శనివారం అందజేసింది. ఆటో డ్రైవర్ల సేవ కార్యక్రమాన్ని మచిలీపట్నంలోని టీటీడీ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించారు. జిల్లాలోని 11,316 మంది లబ్ధిదారులకు రూ.16.97 కోట్ల చెక్కును కలెక్టర్ బాలాజీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఆటోడ్రైవర్లకు ఎటువంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వెంటనే పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం నేపథ్యంలో ఆటో డ్రైవర్లు నష్టపోకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ పథకం అమలు చేస్తున్నారని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.90 లక్షల మందికి ప్రభుత్వం రూ.436 కోట్లను అందించిందన్నారు. ఒక్కో ఆటోడ్రైవర్‌కు ఏడాదికి రూ. 15వేలు అందుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, జేసీ ఎం.నవీన్, మచిలీపట్నం నియోజకవర్గ ప్రత్యేక అధికారి నిత్యానందం, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచే నాని, టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, మోటమర్రి బాబాప్రసాద్, వెంకటస్వామి, మాదివాడ రాము, గోపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణం

ఆటో డ్రైవర్ల సేవ ప్రారంభంతో జిల్లా వ్యాప్తంగా శనివారం పండుగ వాతావరణం నెలకొంది. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము గుడివాడ రైల్వేస్టేషన్ నుంచి మార్కెట్ యార్డు వరకు స్వయంగా ఆటో నడిపి ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. పెనమలూరు నియోజకవర్గం పోరంకిలోని టీడీపీ కార్యాలయం నుంచి కిలారు అనిల్ ఎస్టేట్ వరకు జరిగిన ర్యాలీలో బోడే ప్రసాద్ స్వయంగా ఆటో నడిపారు. గన్నవరం నియోజకవర్గంలోని బస్టాండ్ వద్ద జరిగిన కార్యక్రమంలో కేసరపల్లి నుంచి గన్నవరం బస్టాండ్ వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే వెంకట్రావు స్వయంగా ఆటో నడిపారు. పామర్రు మార్కెట్ యార్డులో జరిగిన కార్యక్రమంలో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, రాష్ట్ర నాట్యమండలి చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి పాల్గొన్నారు. అవనిగడ్డలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, నియోజవర్గ ప్రత్యేక అధికారి పి.సాయిబాబు, పెడన మార్కెట్ యార్డులో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.



ముడా చైర్మన్ పదవిపై ఆశలు!

మళ్లీ బీజేపీకే ఇవ్వాలని తెరవెనుక ప్రయత్నాలు

- టీడీపీ సీనియర్ నాయకుడికే దక్కుతుందని ప్రచారం
- తన కుటుంబానికే ఇవ్వాలని మంత్రి అనుచరుడి డిమాండ్
- రేసులో క్రైస్తవ సంఘాల ప్రతినిధి

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) చైర్మన్ పదవి కోసం కూటమి పార్టీల నాయకులు ఎవరికి వారు తమ ప్రయత్నాలు ముమ్మరం చేసినట్టు జోరుగా ప్రచారం జరుగుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముడా చైర్మన్ పదవిని పొత్తులో భాగంగా గుడివాడకు చెందిన బీజేపీ నాయకుడు మట్టా ప్రసాద్‌కు కేటాయించారు. మచిలీపట్నానికి చెందిన కూటమి నాయకులను కాదని, గుడివాడకు చెందిన ప్రసాద్‌కు ఈ పదవిని కట్టబెట్టడంపై గతంలో కూటమి నాయకులు తమ అసంతృప్తిని బాహాటంగానే వ్యక్తం చేశారు. సీనియర్ నాయకులు సర్దిచెప్పడంతో ఈ పదవిపై ఆశలు పెట్టుకున్నవారు మిన్నకుండిపోయారు. స్థానిక నాయకులు, ముడా కార్యాలయ అధికారులు, సిబ్బంది నుంచి సరైన సహకారం అందకపోవడం, రాజకీయ పరమైన కారణాలతో రెండేళ్ల కొనసాగాల్సిన మట్టా ప్రసాద్ 11 నెలలకే తన పదవికి రాజీనామా చేశారనే ప్రచారం జరిగింది. గత సెప్టెంబరు 9వ తేదీన ప్రసాద్ రాజీనామాను ప్రభుత్వం ఆమోదించింది. దీంతో ఇప్పుడైనా మచిలీపట్నానికి చెందిన సీనియర్ నాయకులకు ముడా చైర్మన్ పదవి ఇవ్వాలనే డిమాండ్ ఇటీవల ఊపందుకుంది. టీడీపీలో సీనియర్‌గా ఉన్న ఓ వ్యక్తి పేరును అధిక శాతం మంది నాయకులు మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకెళ్లినట్టు ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ పదవిపై ఆశపెట్టుకున్న గోపువానిపాలేనికి చెందిన టీడీపీలోని యువకుడు తనకు గాని, తన తల్లికి గాని ముడా చైర్మన్ పదవిని ఇవ్వాలని గతం నుంచి మంత్రి కొల్లుపై ఒత్తిడి తెస్తున్నారని టీడీపీ నాయకులు చెప్పుకుంటున్నారు. ఇదే విషయంపై ఇటీవల మంత్రితో మాట్లాడిన సదరు యువకుడికి స్పష్టమైన హామీ లభించకపోవడంతో వాగ్వాదానికి దిగాడని ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఎన్నికల ముందు క్రైస్తవ మిగతా 6లో..


డాక్టర్ డీఆర్కే ప్రసాద్‌ను అభినందిస్తున్న కలెక్టర్ బాలాజీ

సేవల్లో ఆదర్శం రెడ్‌క్రాస్

కలెక్టర్ బాలాజీ

- జిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షుడిగా డాక్టర్ డీఆర్కేప్రసాద్

6

అవినీతి, ఆక్రమణలు సహించను

- ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ఆరోగ్య కేంద్రాల భవనాల నిర్మాణం పూర్తి చేయాలి

- కలెక్టర్ బాలాజీ



డాక్టర్ వీజీఆర్‌ను అభినందిస్తున్న గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు. చిత్రంలో నటుడు రాజేంద్రప్రసాద్

డాక్టర్ వేణుగోపాలరెడ్డి సేవలు ఆదర్శనీయం

● వీజీఆర్‌కు గోవా గవర్నర్ అశోక్‌గజపతి రాజు అభినందన

భారతీనగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మధుమేహ వ్యాధి (షుగర్) నివారణ, నియంత్రణ కోసం విశేషంగా కృషి చేస్తున్న ప్రముఖ మధుమేహ వైద్య నిపుణులు డాక్టర్ కె.వేణుగోపాలరెడ్డి (వీజీఆర్) సేవలు ఆదర్శనీయమని గోవా రాష్ట్ర గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. డాక్టర్ వీజీఆర్‌కు ప్రకటించిన ప్రజా డైరీ సెలబ్రిటీ అవార్డును గోవా రాజ్‌భవన్‌లో గవర్నర్ అశో క్ గజపతిరాజు చేతుల మీదుగా డాక్టర్ వీజీఆర్ ఇటీవల అందుకున్నారు. గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు మాట్లాడుతూ మధుమేహ వ్యాధి నివారణ, నియంత్రణ కోసం గత 20 ఏళ్లుగా విశేషంగా కృషి చేస్తున్న డాక్టర్ వీజీఆర్ సేవలను ప్రశంసించారు. పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటుచేసి 10 లక్షల మంది విద్యార్థులకు అవగాహన కల్పించారని కొనియాడారు. వాతావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు వీజీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 50 వేల మొక్కలను, పండ్ల మొక్కలను హాస్పిటల్‌కు వచ్చే రోగులు, రైతులకు అందజేయడం స్ఫూర్తిదాయ కమన్నారు. వివిధ భాషల్లో రూపొందించిన వీజీఆర్ డయాబెటీస్ అట్లాస్ బుక్‌లను డాక్టర్ వీజీఆర్ గవర్నర్‌కి అందజేయగా ఆయన డాక్టర్ వీజీఆర్‌ను అభినందిస్తూ ముందుమాట రాశారు. ప్రముఖ సినీ నటుడు రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి, ఆక్రమణలు సహించను

● ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో అవినీతిని ఎట్టి పరిస్థితులను సహించేది లేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు. గన్నవరంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గన్నవరంలో అవినీతి రహిత, శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని ఆక్రమణలను నిగ్గు తేల్చేందుకు కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. రాజకీయాలకతీతంగా ఆక్రమణలను విడగొట్టి ప్రభుత్వ భూములు కాపాడతామని హామీ ఇచ్చారు. 15 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. తనను ఆదరించి అక్కున చేర్చుకున్న గన్నవరం ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. తనని ప్రోత్సహిస్తూ, నియోజకవర్గంలో సెజ్‌లకు రూ.29 కోట్లు కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు యార్లగడ్డ కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు యార్లగడ్డ పేర్కొన్నారు. తాను గన్నవరంలోనే ఉంటానని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రోత్సాహంతో ఇక్కడే రాజకీయం చేస్తానని మరోసారి స్పష్టం చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు గూడపాటి తులసీ మోహన్ పాల్గొన్నారు.



వరదలకు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న రైతు సంఘం ప్రతినిధులు

వరద బాధిత రైతాంగాన్ని ఆదుకోవాలి

● రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్

చల్లపల్లి/ఘంటసాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : వరద బాధిత రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ డిమాండ్ చేశారు. కృష్ణానది పరీవాహక ప్రాంతాలైన ఘంటసాల, చల్లపల్లి మండలాల్లో రైతుసంఘం నాయకుల బృందం ఆదివారం పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. కెవివి.ప్రసాద్ మాట్లాడుతూ, శ్రీకాకుళం పరివాహక ప్రాంతంలో 146 ఎకరాల్లో కంద, పసుపు, అరటి, మినుము తదితర పంటలు వరద తాకిడికి నష్టపోయాయన్నారు. వరదల కారణంగా ఎకరానికి రైతుకు రెండు లక్షల నష్టం జరిగిందని వివరించారు. నష్టాన్ని అంచనా వేసే అధికారులు రాజకీయాలకు అతీతంగా అంచనాలు రూపొందించాలన్నారు. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవడానికి అవసరమైన రుణాలు ఇవ్వాలని కోరారు. 100 శాతం సబ్సిడీతో విత్తనాలు, పురుగుమందులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. రైతుసంఘం రాష్ట్రకార్యవర్గ సభ్యులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, రైతుసంఘం నాయకులు వేమూరి రత్నగిరిరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కుంపటి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు కోడి రాధాకృష్ణ, రాజారత్నం, సీపీఐ సీనియర్ నాయకులు బిక్షం రాజు, వెంకటేశ్వరరావు, మల్లుపెద్ది బోసు, దాసరి గోపాలకృష్ణ, రాజారత్నం, నక్కా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న రెడ్‌క్రాస్ కార్యవర్గం

సేవల్లో ఆదర్శం రెడ్‌క్రాస్ : కలెక్టర్ బాలాజీ

● జిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షుడిగా డాక్టర్ డీఆర్కే ప్రసాద్

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీని ఆదర్శవంతమైన సంస్థగా రూపొందించాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. జిల్లాపరిషత్ సమావేశపు హాలులో శనివారం జిల్లా రెడ్ క్రాస్ కమిటీ కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా స్వచ్ఛ సుందర చల్లపల్లి ఉద్యమ కార్యకర్త డాక్టర్ డీఆర్కే ప్రసాద్, ఉపాధ్యక్షునిగా ఎస్ఎస్ఆర్ కళాశాల డైరెక్టర్ శిర్విశెట్టి భాస్కర్, కోశాధికారిగా రిటైర్డు పోలీసు అధికారి పి.సుకుమార్, కార్యవర్గ సభ్యులుగా గుడివాడ మెహర్ ప్రసాద్, పి.శ్రీరాం, వి.సుందరరాం, చల్లపల్లి సబ్ బ్రాంచి ప్రతినిధి నడకుదిటి లీలా బ్రహ్మేంద్ర, నాగాయలంక శాఖ ప్రతినిధి బి.విష్ణువర్ధన్, విశ్రాంత ఎంఈవో బిహెచ్ శంకరనాథ్, మొవ్వ శాఖ ప్రతినిధి బెల్లంకొండ వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా విశ్రాంత డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ, జె.బాబూరావు, పి.సుబ్బారావు, ఉయ్యూరు విశ్వశాంతి డైరెక్టర్ డాక్టర్ ఎం.సూర్యకుమార్ ఎన్నికయ్యారు. కార్యవర్గంతో కలెక్టర్, జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డీకే బాలాజీ ప్రమాణ స్వీకారం చేయించారు. రెడ్‌క్రాస్ సంస్థ రాష్ట్ర పరిశీలకుడు రామచంద్రరాజు మాట్లాడుతూ, రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాలను బలోపేతం చేద్దామన్నారు. డీఆర్వో కె. చంద్రశేఖరరావు, రెడ్‌క్రాస్ ప్యాట్రన్స్, వైస్ ప్యాట్రన్‌లు, జీవిత సభ్యులు పాల్గొన్నారు. రెడ్‌క్రాస్ భవనాన్ని విస్తరించాలని సభ్యులు కోరగా సీఎస్ఆర్ నిధులతో భవనాన్ని విస్తరిద్దామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ముందుగా రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు జ్యూనాడ్ చిత్రపటానికి నివాళులర్పించారు.



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భవానీలు



అన్నప్రసాద కేంద్రం వద్ద..



భవానీలతో కిక్కిరిసిన కనకదుర్గానగర్

జై భవానీ..జైజై..భవానీ

● బెజవాడ వీధుల్లో జగన్మాత నామస్మరణ ప్రతిధ్వని ● పోటెత్తిన భవానీ దీక్షాపరులు ● అంతా అరుణమయం



జై భవానీ, .జై జై భవానీ నామస్మరణ విజయవాడలో మార్మోగుతోంది. ఇంద్రకీలాద్రిపైన, కొండ దిగువన ఎక్కడ చూసినా ఎరుపు దుస్తులు, పూలదండలు వేసుకుని, ఇరుముడులు ధరించిన భవానీలే. కొండకు వస్తున్న వారు, అమ్మవారిని దర్శించుకుని తిరిగి వెళ్తున్న భవానీ దీక్షాపరులతో కెనాల్ రోడ్డుతో పాటు వన్‌టౌన్‌లోని వీధులన్నీ అరుణమయం అయ్యాయి. ఉత్తరాంధ్ర జిల్లాల భవానీ భక్తులు దీక్ష చేపట్టిన చిన్నారులు, కుటుంబాలతో తరలివచ్చారు.

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై 11 రోజుల పాటు కొనసాగిన కనకదుర్గమ్మ దసరా మహోత్సవాలలో రోజుకు సగటున 1.25 లక్షల మందికిపైగా భక్తులు అమ్మవారి దర్శనానికి రాగా, ఉత్సవాలు ముగిసి రెండు రోజులైన తరువాత శనివారం కూడా అంతకు మించి భక్తుల రద్దీ ఎక్కువగా కనిపించింది. ఆ పదకొండు రోజులు అమ్మ వారిని దర్శించుకున్న భక్తులు ఒక ఎత్తయితే, గత రెండు రోజులుగా అమ్మ వారిని ఇలవేల్పుగా భావించి ఆరాధించే భవానీ భక్తులు రావడం విశేషం. మండల, అర్ధమండలం దీక్ష చేపట్టిన భవానీలు అన్ని రోజులూ పూజించి ఇరుముడులు ధరించి అత్యంత భక్తిభావంతో తరలివచ్చారు. మహిళలకు స్త్రీ శక్తి పథకం కింద ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం ప్రభుత్వం కల్పించడంతో మహిళలు అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దసరా ఉత్సవాలలో సైతం మహిళా భక్తులతో బస్సులు కిటకిట లాడాయి. భక్తుల రద్దీ కారణంగా దుర్గగుడి ఘాట్‌రోడ్డులో వాహనాల రాకపోకలను బంద్ చేశారు. దేవస్థానం బస్సులను కూడా నిలిపివే శారు. అమ్మవారిని దర్శించుకునడానికి వచ్చిన భక్తులు క్యూలలో అత్యధిక సమయం పాటు వేచి ఉండకుండా శీఘ్రదర్శన ఏర్పాటు చేశారు. అంతరాలయ దర్శనం రద్దు చేశారు. బంగారువాకిలి ముఖ మండపం నుంచి దర్శనం కల్పించారు. అమ్మవారి శరణు ఘోషతో ఆలయ ప్రాంగణం మార్మోగుతోంది. ఈవో శీనానాయక్, అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ తగిన చర్యలు తీసుకుంటున్నారు. శనివారం సాయంత్రం వరకు సుమారు లక్షన్నర మంది భక్తులు అమ్మ వారిని దర్శించుకున్నారు. భక్తులు ఉచిత అన్న ప్రసాదాన్ని స్వీకరించడంతో పాటు లడ్డూ ప్రసాదాలను కొనుగోలు చేస్తున్నారు. వాన ప్రభావం ఏదీ లేకపోవడంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అమ్మవారి దర్శనం సజావుగా సాగిపోతోంది. ఈవో శీనానాయక్ శనివారం లడ్డూ ప్రసాదం తయారీ, నాణ్యత, విక్రయాలను పరిశీలించారు. బాగా రద్దీగా ఉన్నప్పుడు రెండు లడ్డూలు మాత్రమే ఇచ్చేవారని, ఇప్పుడు ఆరు లడ్డూల చొప్పున ఉండే రెండు ప్యాకింగ్‌లను అంటే డజను లడ్డూలు అందజేస్తున్నామని తెలిపారు. గత ఏడాడి 28,09,007 లడ్డూలను విక్రయించగా ఈ ఏడాది 3వ తేదీ రాత్రి వరకు 35,67,205 లడ్డూలను విక్రయించినట్లు చె ప్పారు.



దుర్గమ్మ సేవలో సీఎం కార్యాలయ కార్యదర్శి ప్రద్యుమ్న

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ వారిని శనివారం సీఎం కార్యాలయ కార్యదర్శి ప్రద్యుమ్న దంపతులు దర్శించుకున్నారు. అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం వారికి వేద ఆశీస్సులు, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. ఈవో శీనానాయక్ అమ్మవారి చిత్రపటం అందజేశారు. ప్రద్యుమ్నకు దసరా ఉత్సవాల నిర్వహణ గురించి ఈవో శీనానాయక్ తెలిపారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించినందుకు ఈవో శీనానాయక్‌ను సీఎం కార్యాలయ కార్యదర్శి ప్రద్యుమ్న అభినందించారు.

ఎలక్ట్రికల్ ఆటోలకు ప్రోత్సాహం : సీఎం



విజయవాడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎలక్ట్రికల్ ఆటోలకు ప్రోత్సాహం అందిస్తానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో 'ఆటోడ్రైవర్ల సేవలో' పథకాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల సంక్షేమం గురించి మాట్లాడిన చంద్రబాబు విజయవాడలో ఆటోలన్నీ సీఎన్‌జీ కావటాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. రాష్ట్ర విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం కాలుష్యాన్ని తగ్గించేందుకు ఆటోలన్నింటినీ సీఎన్‌జీ చేయాలని నిర్ణయించిందన్నారు. ఆటో డ్రైవర్ల ఆదాయాన్ని మరింతగా పెంచటం కోసం రానున్న రోజులలో విజయవాడ నుంచి ఎలక్ట్రికల్ ఆటోలకు అవకాశం కల్పిస్తానని చెప్పారు. ఎలక్ట్రికల్ ఆటోల ద్వారా నిర్వహణ ఖర్చు భారీగా తగ్గుతుందన్నారు.

ఆటో డ్రైవర్ అఫ్సర్‌ఖాన్‌కు ఎన్నో ప్రయోజనాలు

సీఎం చంద్రబాబు ప్రయాణించిన ఆటో డ్రైవర్ అఫ్సర్ ఖాన్‌కు కూటమి ప్రభుత్వంలో ఎన్నో ప్రయోజనాలు దక్కాయి. ఆటోడ్రైవర్ సేవలో పథకంలో రూ.15 వేలు, తల్లికి వందనం పథకం కింద కుటుంబానికి రూ.13 వేలు, దీపం 2.0 పథకం ద్వారా మూడు ఉచిత సిలిండర్లను అందుకుంది. బుడమేరు వరదలలో అఫ్సర్‌ఖాన్ ఆటో మునిగిపోగా, ఆటో మరమ్మతులకు రూ. 10 వేలను ప్రభుత్వం చెల్లించింది.

ఆటో డ్రైవర్ల సేవలో లబ్ధి ఇలా :

ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం 27,721 మంది లబ్ధిదారులకు రూ.41.57 కోట్ల మేర లబ్ధి కలుగుతోంది. ఎన్టీఆర్ జిల్లాలో 16,405 మంది లబ్ధిదారులకు రూ.24.60 కోట్లు , కృష్ణాజిల్లాలో 11,316 మందికి రూ.16.97 కోట్ల మేర లబ్ధి కలుగుతోంది. ఆటో రిక్షాలు, లగ్జరీ టూరిస్ట్ క్యాబ్, లగ్జరీ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్, మోటార్ క్యాబ్, సెమీ లగ్జరీ టూరిస్ట్ క్యాబ్‌ల కేటగిరీలో ఈ పథకం వర్తిస్తుంది.

థ్యాంక్యూ సీఎం సార్..!

విజయవాడ రూరల్ : "ఆటో డ్రైవర్ల సేవలో' పథకం వారి కుటుంబాల్లో ఆనందాన్ని నింపింది. స్త్రీశక్తి పథకం తమ ఉపాధిపై ప్రభావం చూపిస్తుందన్న ఆందోళనలో ఉన్నామని, తాము అడగకపోయినా కూటమి ప్రభుత్వం రూ.15 వేల ఆర్థిక సాయం ప్రకటించడాన్ని హర్షిస్తున్నారు, వారి స్పందన ఇలా..

ఆటో డ్రైవర్లకు ఊరట



'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం మా డ్రైవర్లకు ఊరటనిచ్చింది. రూ.15 వేలు మా ఖాతాల్లో జమ చేయడంతో ఆటో ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, ఇన్సూరెన్స్‌లకు సరిపోతాయి.

- భీమన ఆంజనేయులు

ఆర్థిక భారం తగ్గుతుంది



ఉచిత బస్సు పథకం ప్రభావం మాపై ప్రభావం పడకుండా ఉండేందుకు రూ.15వేలు డ్రైవర్ల ఖాతాలో జమ చేయడంతో కొంత ఆర్థికభారం తగ్గుతుంది.

- కె.మణి

కేసుల భారం కూడా తగ్గింది



ఎన్డీయే అధికారంలోకి వచ్చాక పోలీసు కేసుల భారం తగ్గింది. ఈ విషయంలో ప్రభుత్వ వైఖరి ఆటోడ్రైవర్ల పట్ల ఇలానే సానుకూలంగా ఉండాలని కోరుకుంటున్నా.

- బి.సాయి

ఆర్థిక భారం తగ్గుతుంది



విజయవాడలో ఆటోలకు ప్రత్యేకంగా స్టాండ్‌లు, షెల్టర్లు ఏర్పాటు చేయిస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. దానిని నెరవేర్చాలి

-పెదమల్లు విజయకుమార్

సీఎంకు ధన్యవాదాలు



ఆటో డ్రైవర్ల ఖాతాల్లో రూ.15 వేలు జమ చేసిన సీఎం చంద్రబాబుకు ఎంతో రుణపడి ఉంటాం. ఆయనకు ధన్యవాదాలు.

- బి.పండు

అరుణవర్ణం

(5వ పేజీ తరువాయి)

పోలీసులు అనుసరిస్తున్నారు.

రెండు లక్షలు దాటే అవకాశం

శనివారం రాత్రి ఆలయం మూసివేసే సమయానికి అమ్మవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య రెండు లక్షలు దాటే అవకాశం ఉందని తెలుస్తోంది. తెల్లవారు జామున మూడు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు 1.50 లక్షల మంది అమ్మవారిని దర్శించుకున్నారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర వైపు నుంచి వస్తున్న రైళ్లు, బస్సుల్లో ఎక్కువ మంది భవానీలు విజయవాడకు చేరుకుంటున్నారు. ఒక్కో రైలులో 1500-2వేల మంది భవానీలు వస్తున్నారని అధికారులు అంచనా వేస్తున్నారు. భవానీల రద్దీ కొనసాగడంతో రెండు హోల్డింగ్ పాయింట్లను అధికారులు ఉపయోగించారు. వాస్తవానికి శనివారం భవానీల రద్దీ తగ్గుతుందని అధికారులు భావించారు. ఈ రద్దీ పెరగడంతో అంచనాలు తారుమారయ్యాయి. ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి వచ్చే రైళ్లు, బస్సుల రాక సమయాన్ని బట్టి పోలీసులు క్యూలైన్లు, హోల్డింగ్ పాయింట్లను ఖాళీ చేయిస్తున్నారు. స్నానాల ఘాట్ల నుంచి ఇంద్రకీలాద్రి వరకు సాధారణ భక్తుల కంటే భవానీ భక్తులే ఎక్కువగా కనిపిస్తున్నారు. ఈ ఏడాది మొత్తం 7-8లక్షల మంది భవానీ మాలలు ధరించారని గురుభవానీలు చెబుతున్నారు. ఇప్పటి వరకు 3.50 లక్షల మంది భవానీలు ఇంద్రకీలాద్రికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ భవానీల రద్దీ ఆదివారం, సోమవారం కొనసాగే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

శాస్త్రోక్తంగా పూర్ణాహుతి

(5వ పేజీ తరువాయి)

గురుప్రసాద్ దంపతులకు ఆశీస్సులు అందజేశారు. పూర్ణాహుతి హోమ ద్రవ్యాలను సమర్పించారు. అనంతరం అన్నవితరణ కార్యక్రమంలో సీపీ దంపతులు పాల్గొని వడ్డన చేశారు.

కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సీపీ

వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కార్యక్రమాలు ముగిసిన అనంతరం సీపీ రాజశేఖరబాబు కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. దుర్గగుడిలో దసరా ఉత్సవాల విధుల్లో ఆరు వేల మంది వరకు పోలీసులు పాల్గొన్నారని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించినట్లు చెప్పారు. పోలీసు సిబ్బంది గతం కంటే బాగా పనిచేశారని కితాబు ఇచ్చారు. అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

ముడా చైర్మన్ పదవిపై ఆశలు!

(5వ పేజీ తరువాయి)

సంఘాల ప్రతినిధిగా వ్యవహరించిన ఒక పాస్టర్‌ను రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాలలో తిప్పి ఓటు బ్యాంకును రాబట్టుకున్నారని, ఈ నేపథ్యంలో ఆయనకు ఈ పదవిని ఇవ్వాలనే డిమాండ్ ఇటీవల కాలంలో ఊపందుకుంది. తమకు న్యాయం చేయకుంటే తమ దారి తాము చూసుకుంటామనే సంకేతాలను వారు పంపుతున్నట్లు సమాచారం.

తెరవెనుక బీజేపీ నాయకుల ప్రయత్నాలు

ముడా చైర్మన్ పదవిని మళ్లీ దక్కించుకునేందుకు బీజేపీ నాయకులు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ వద్దకు ఇటీవల జిల్లాకు సరిహద్దున ఉన్న బీజేపీ ఎమ్మెల్యే ద్వారా వెళ్లి తమ ప్రతిపాదనను తెలియజేశారు. ఢిల్లీ పెద్దల ద్వారా కూడా మంత్రాంగం నడిపేందుకు తమ వంతు ప్రయత్నాలు ఇప్పటికే చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

కాగా, గతంలో ముడా చైర్మన్‌గా పనిచేసిన మట్టా ప్రసాద్ ముడా చైర్మన్ హోదాలో తాను పనిచేసిన సమయంలో ఎదుర్కొన్న ఇబ్బందులు, ముడాకు చెందిన భూములలో ఆక్రమ ఇసుక తవ్వకాలు తదితర అంశాలను ప్రస్తావిస్తూ 13 పేజీల లేఖను ప్రభుత్వం పెద్దలకు ఇచ్చినట్లు బీజేపీ నాయకులు చెబుతున్నారు.

లైంగిక వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య

(5వ పేజీ తరువాయి)

పెట్టారు. దీంతో పెద్దలు పవన్‌ను మందలించారు. అయినా వేధింపులు ఆపకపోవడంతో శుక్రవారం వసంత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే గుడివాడలోని ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం వేకువజామున మృతి చెందింది. మృతురాలికి నాలుగు, ఏడేళ్ల వయసు కలిగిన ఇద్దరు కుమారులు ఉన్నారు.

బాధితురాలు ఆస్పత్రిలో వచ్చిన మరణ వాఙ్మూలం ఆధారంగా పామర్రు పోలీసులు కేసు నమోదు చేశారు. గుడివాడ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం వసంత మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.



జీఎస్టీపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు మేలు : బోడె

ఉయ్యూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్డీఏ ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపులో రైతులకు పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఉయ్యూరు వ్యవ సాయ మార్కెట్ కమిటీ ఆవరణలో వ్యవసాయశాఖ, మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై రైతులకు అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని రైతులనుద్దేశించి మాట్లాడారు. వ్యసాయ పరికరాలు, యం త్రాలు, పురుగు మందులపై జీఎస్టీ తగ్గించి కూటమి ప్రభుత్వం రైతుకు చేయూత నిచ్చిందన్నారు. ట్రాక్టర్లపై గతంలో ఉన్న 12 శాతాన్ని 5 శాతానికి, టైర్లు, విడిభాగాలపై 18 శాతం నుంచి 5 శాతానికి డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింకర్లపై 12 నుంచి 5 శాతానికి తగ్గించడం వల్ల రైతులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. రైతు సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలుతో ప్రజల్లో మంచి స్పందన కన్పిస్తుందనా న్నరు. పెదఓగిరాల నుంచి సభా స్థలి వరకు ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాల ర్యాలీని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. జీఎస్టీ కమిషనర్ చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, ఉద్యాన శాఖ అధికారి జ్యోతి, ఏఎంసీ చైర్మన్లు కొండా ప్రవీణ్, ధన కోటేశ్వరరావు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి మురళీకిషోర్, అనుమోలు ప్రభాకర్, జయదేవ్, వి.సత్యనారాయణ, జనసేన నాయకుడు ముప్పా రాజా, ఆనందప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూ దోపిడీకి వ్యతిరేకంగా పాదయాత్ర 8 నుంచి

● మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

గాంధీనగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : తమ భూములు ఉంటాయో, ఉండవోనని చిన్న, సన్నకారు రైతులు తీవ్ర భయాందోళనలో ఉన్నారని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న భూదోపిడీ, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 8 నుంచి పాదయాత్ర చేపడుతున్నట్టు చెప్పారు.గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త జమీందార్లను సృష్టిస్తున్నాయన్నారు. లక్షలాది ఎకరాల విలువైన భూములను కారు చౌకగా అంబానీ, ఆదానీ వంటి జమిందార్లకు కట్టబెడుతున్నాయని ఆరోపించారు. చట్టాలు, రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ బడా కార్పొరేట్లకు భూములు కట్టబెడుతున్నారని మండిపడ్డారు విజయవాడలో అత్యంత ఖరీదైన ఆర్టీసీ స్థలాన్ని ఆర్టీసీ యాజమాన్యం, కార్మిక సంఘాలు , కార్మికులతో చర్చించకుండా లులు సంస్థకు కేటాయించడాన్ని తప్పుబట్టారు. విశాఖపట్నంలో వేలాది ఎకరాల భూమిని కేవలం ఎకరం 99 పైసలకే కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం సరైందికాదన్నారు. ఆంధ్ర ఉద్యమాల జేఏసీ కన్వీనర్ మహాదేవ్ మాట్లాడుతూ ఈనెల 8న ఉద్దానంలో జరిగే భారీ బహిరంగ సభతో పాదయాత్ర ప్రారంభమై వివిధ ప్రాంతాల్లో కొనసాగి ఈ నెల 28న విజయవాడలో జరిగే బహిరంగ సభతో ఈ పాదయాత్ర ముగుస్తుందన్నారు. అల్లాపురం ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ నేత వేదవతి పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల భవనాల నిర్మాణం పూర్తి చేయాలి

● కలెక్టర్ బాలాజీ ఆదేశం

మచిలీపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రాంతాల్లో ఆరోగ్య కేంద్రాల భవనాలను త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. శనివారం పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిస్థితిపై ఆయన సమీక్ష నిర్వహించారు. మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు, పెడన పురపాలకసంఘాల్లో ఏడు ఆరోగ్య కేంద్రాలు వివిధ దశల్లో ఉన్నట్లు తెలిపారు. గుడివాడలోని ఆరోగ్య కేంద్రం టెండర్ల ప్రక్రియను త్వరాగా పూర్తి చేయాలన్నారు. అమృత్-2.0 పథకం ద్వారా రూ. 181.31 కోట్లతో చేపట్టనున్న పనుల టెండర్ ప్రక్రియ ను పూర్తిచేయాలని అన్నారు. తాగునీటి పైపులైన్‌లకు ఉన్న లీకేజీలకు మరమ్మతులు చేయించాలన్నారు. మచిలీపట్నం డంపింగ్ యార్డులో మిగిలిన 30 వేల టన్నుల చెత్త తొలగించేందుకు తగుచర్యలు తీసుకోవాలన్నారు. పెడన పురపాలకసంఘంలో 10 రోజుల వ్యవధిలో చెత్తగుట్టలను తొలగించాలన్నారు. మచిలీపట్నం, గుడివాడ, తాడిగడప, ఉయ్యూరు కమిషనర్లు బాపిరాజు, మనోహర రావు, నజీర్, రామారావు, ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ ప్రవీణ్ పాల్గొన్నారు.

సోలార్ ప్యానెళ్లకూ జీఎస్టీ తగ్గింపు

విజయవాడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీని తగ్గిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకోవడంతో పీఎం సూర్యఘర్ పథకంలోని సోలార్ ప్యానెళ్ల ధరలు తగ్గినట్టు సీపీడీసీఎల్ ఎస్ఈ హనుమయ్య తెలిపారు. ప్యానళ్లు, ఇన్వర్టర్లపై జీఎస్టీ తగ్గిందని తెలి పారు. మూడు కిలోవాట్ల విద్యుత్ సర్వీసుపై రూ.10 వేల వరకు తగ్గింపు వర్తిస్తుందని వివరించారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



స్వామివారి సన్నిధిలో కృత్తిరెడ్డి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో సాహిత్య అకాడమీ కార్యదర్శి

మోపిదేవి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కృత్తిరెడ్డి శ్రీనివాసరావు శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పర్యవేక్షకులు మధుసూదనరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు ఆయనకు అందించారు.

ఎస్సీలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి

● మాల సంక్షేమ సహకార ఆర్థిక సంస్థ చైర్మన్ పెదపూడి విజయకుమార్

మచిలీపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ద్వారా ఎస్సీలకు సంక్షేమ ఫలాలు అందిస్తామని రాష్ట్ర మాల సంక్షేమ సహకార ఆర్థిక సంస్థ చైర్మన్ పెదపూడి విజయకుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ప్రభుత్వం ఎస్సీల అభివృద్ధికోసం అమలుచేస్తున్న పథకాలవివరాలు, అమలవుతున్న తీరును ఆయన అడిగి తెలుసుకున్నారు. వివిధ సంక్షేమ కార్యక్రమాలతోపాటు భూమి కొనుగోలు పథకం వంటివి అమలు అవుతున్నాయా లేదా అని ఆరా తీశారు. తొలుత ఆర్ అండ్ బీ అతిథిగృహంలో ఎస్సీ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి ఎస్సీల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, వివిధ పథకాల అమలులో జాప్యం, నూతన కార్యక్రమాల రూపకల్పన తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. సంస్థ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఎస్సీ కార్పొరేషన్ ఈవో సెల్వీ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

తోపుడు బళ్లు అందజేత

పెనమలూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : యనమలకుదురు, కానూరుకు చెందిన మహిళలు షేక్ మీరాబీ, షేక్ సమీరా సుల్తానాల జీవనోపాధి నిమిత్తం యువనేత బోడె వెంకట్రామ్ తోపుడు బళ్లను శనివారం అందజేశారు. కూటమి నేతలు అనుమోలు ప్రభాకరరావు, చెన్నుపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు





గన్నవరంలో ఆటో డ్రైవర్లకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు.. పోరంకిలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

గన్నవరం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు భరోసా ఇచ్చారు. శనివారం ఉదయం గన్నవరంలో ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని యార్లగడ్డ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేసరపల్లి గ్రామం నుంచి గన్నవరం వరకు ఆటో డ్రైవర్లు ఆటోలతో ర్యాలీ నిర్వహించగా ఎమ్మెల్యే ఆటో నడిపి డ్రైవర్లను, కార్యకర్తలు ఉత్సాహపరిచారు. నియోజకవర్గంలోని ఈ పథకం లబ్ధిదారులైన 2,470 మంది ఆటో డ్రైవర్లకు రూ. 3.70 కోట్ల చెక్‌ను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించామని, ఈ పథకం వల్ల ఆటో డ్రైవర్లకు కలిగిన ఇబ్బందిని గుర్తించి వారిని ఆదుకునేందుకు రూ.15వేలు చొప్పున ఎకౌంట్లో జమ చేస్తున్నట్లు వివరించారు. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 2.9 లక్షల మంది లబ్ధిదారులకు రూ.436 కోట్లు డ్రైవర్ అకౌంట్లో జమ చేస్తున్నట్లు చెప్పారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీవో టి.స్వర్ణలత పలువురు అధికారులు పాల్గొన్నారు.

అండగా కూటమి ప్రభుత్వం

● ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు: ఆటోడ్రైవర్ల కుటుంబాలకు టీడీపీ కూటమి ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ హామీ ఇచ్చారు. శనివారం పోరంకి కిలారు అనిల్ ఎస్టేట్స్ ప్రాంగణంలో జరిగిన ఆటోడ్రైవర్ల సేవలో పథకం ప్రారంభంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గం మొత్తం మీద ఒక్కో డ్రైవర్‌కు 15వేల చొప్పున మొత్తం 2,066 మంది డ్రైవర్లకు షుమారు మూడు కోట్ల పది లక్షల రూపాయలను అందించే చెక్కును టీడీపీ కూటమి నాయకులు, ప్రభుత్వ అధికారులు, ఆటో కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ముందుగా ఎమ్మెల్యే ఆటో డ్రైవర్లతో కలిసి స్వయంగా ఆటో నడుపుతూ పోరంకి టీడీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా సభా ప్రాంగణం వద్దకు చేరుకొని అందరినీ ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కూటమి నేతలు అనుమోలు ప్రభాకరరావు, మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, యార్లగడ్డ సుచిత్ర, బోడె వెంకట్రాం, కొండా ప్రవీణ్, అన్నే ధనయ్య, సంగెపు రంగారావు, శొంఠి శివరాంప్రసాద్, పీతా గోపీచంద్, పేరేపి ఈశ్వర్, యేకుల విజయేంద్ర, ఆటో యూనియన్ నాయకులు కొసరాజు నాగమల్లేశ్వరరావు, అధికారులు షేక్ నజీర్, సుబ్బారావు, బండి ప్రణవి, అనూష, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాత గ్రామోత్సవం

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : దసరా ఉత్సవాలు ముగింపు సందర్భంగా శుక్రవారం రాత్రి జంక్షన్ స్థానిక వాసవీ మాతకు బాపులపాడు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. శరన్నవరాత్రి వేడుకలు నిర్వహించిన అనంతరం వాసవీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి జంక్షన్ నాలుగు రోడ్లలో గ్రామోత్సవం జరిపారు. తవ్వా సూర్యకళ నేతృత్వంలో ఆర్యవైశ్య మహిళలు ప్రదర్శించిన కోలాటం ఆకర్షణగా నిలిచింది.







జంక్షన్ అభయాంజనేయస్వామి ఆలయం ఎదుట ఎమ్మెల్యే యార్లగడ్డ జన్మదినోత్సవ కేకు కట్ చేస్తున్న దయాల రాజేశ్వరరావు.. వీరవల్లిలో పేదలకు నూతన వస్త్రాలను పంపిణీ చేస్తున్న కలపాల శ్రీధర్, లంక సురేంద్ర మోహన బెనర్జీ.. పంచాయతీ కార్యదర్శులతో కలిసి కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

అందరి సహకారంతో నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతా

జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు





తెలుగు మహిళలతో కలిసి కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ.. ఎమ్మెల్యేకు బొకేలు అందజేస్తున్న నాయకులు

గన్నవరం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : అందరి సహకారంతో రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. స్థానిక బస్టాండ్ సమీపంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన అభిమానులు కూటమి నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు అధిక సంఖ్యలో వచ్చి గజమాలలతో సత్కరించి, శాలువాలు కప్పి, బొకేలు అందజేసి, కేకులు కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు గూడపాటి తులసీమోహన్, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఉప సర్పంచ్ పాలడుగు నాని, జాస్తి శ్రీధర్, బోయపాటి మురళీకృష్ణ, గొంది శివకోటేశ్వరరావు, జాస్తి ఫణిశేఖర్, తుమ్మల లక్ష్మణరావు, బోయపాటి బసవపూర్ణయ్య, బోడపాటి రవి, మేడేపల్లి రమా, పల్లి కార్తీక్, తుమ్మల చిన్న, గొంది నరేంద్ర, కొసరాజు రాము, బొప్పిడి దొరబాబు, ముద్రబోయిన శ్రీనివాసరావు, ఎంపీడీవో స్వర్ణలత, కార్యదర్శులు ప్రసాద్, చెన్నకేశవరావు, శివ, ఏఎంసీ ఛైర్మన్ గూడవల్లి నర్సయ్య, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, చలమలశెట్టి రమేష్‌బాబు, చిమట రవివర్మ తదితరులు పాల్గొన్నారు. 5వేల మందికి అన్నదానం నిర్వహించారు.

● మండలంలోని బుద్ధవరం కేర్ అండ్ షేర్‌లో టీడీపీ నాయకుడు అన్నే హరికృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పిల్లలతో కేక్ కట్ చేయించి 500 మందికి అన్నదానం నిర్వహించారు. గూడపాటి దుర్గాప్రసాద్, మూల్పూరి మాధవన్, కోసూరు వెంకటేష్, అంజిబాబు, సుధాబత్తుల రామకృష్ణ, శేషుకుమార్, రేణుకరాణి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే యార్లగడ్డ పేరిట పూజలు

హనుమాన్‌జంక్షన్ : కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అహర్నిశలు చేస్తున్న కృషి అభినందనీయమని టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు అన్నారు. శనివారం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు జన్మదిన వేడుకను రాజేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక అభయాంజనేయస్వామి దేవస్థానం ఎదుట ఘనంగా నిర్వహించారు. ముందుగా టీడీపీ నేతలు ఆలయంలో యార్లగడ్డ పేరిట పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వేముపల్లి శ్రీనివాసరావు, మూల్పూరి సాయికల్యాణి, గుండపనేని ఉమావర ప్రసాద్, అట్లూరి శ్రీనివాసరావు, చింతల అప్పారావు, వేగిరెడ్డి పాపారావు, మండాది రవీంద్ర, మాదల శ్రీనివాసరావు, గార్లపాటి రాజేశ్వరరావు, వడ్డిల్లి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజానాయకుడు ఎమ్మెల్యే యార్లగడ్డ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: పేదలకు సంక్షేమాన్ని అందిస్తూ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేలా కృషి చేస్తున్న ప్రజానాయకుడు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అని టీడీపీ నాయకులు కొనియాడారు. వీరవల్లి, ఆరుగొలను, తిప్పనగుంట, కానుమోలు, మల్లవల్లి, రంగయ్యప్పారావుపేట, కాకులపాడు తదితర గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వీరవల్లిలో టీడీపీ నాయకుడు కలపాల శ్రీధర్ ఆధ్వర్యంలో 51కేజీల భారీ కేక్‌ను లంక సురేంద్ర మోహనబెనర్జీ, గుండపనేని ఉమావరప్రసాద్, మండాది రవీంద్రలతో కలిసి కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అమృతపల్లి సూర్యనారాయణ, పీఏసీఎస్ అధ్యక్షుడు కలపాల నాని, సర్పంచ్ పిల్లా అనిత, పతంజలి డీజీఎం కలపాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. తిప్పనగుంటలో డీసీ ఛైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్ ఆధ్వర్యంలో, ఆరుగొలనులో టీడీపీ అధ్యక్షుడు బేతా శేషుకుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.

బాలలకు సత్కారం



ఉయ్యూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన విజయవాడ ఉత్సవ్ డ్యాన్స్ విభాగంలో విజయకేతనం ఎగురవేసి ప్రథమ బహుమతులు సాధించిన శ్రీమ్యూజిక్ ఇనిస్టిట్యూట్ బాలలు, నిర్వాహకుని ఉయ్యూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఛైర్మన్ వి. సత్యనారాయణ, కమిషనర్ జాస్తి రామారావు శనివారం ఘనంగా సత్కరించారు. శ్రీమ్యూజిక్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకుడు ధూళిపూడి శేషగిరిరావును ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకుడు పంచ్రాజు చిరంజీవి, చందు విద్యార్థులను అభినందించారు.

ఘనంగా కుమారి పూజ



ఉయ్యూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గండిగుంట శ్రీగణపతి సచ్చిదానందస్వామి ఆశ్రమంలో శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం అమ్మవారికి పూజలు, కుంకుమార్చన చేసి బాలికలకు కుమారి పూజ ఘనంగా నిర్వహించారు. బాలికలను అమ్మవారిగా అలంకరించి శాస్త్రోక్తంగా కుమారి పూజ చేశారు. గోపూజ, పూర్ణాహుతి, తదితర పూజలు చేసి భక్తులకు అన్నసమారాధన చేశారు. ట్రస్టు ఛైర్మన్ నాదెళ్ల మంజుల, నాదెళ్ల విశ్వేశ్వరరావు, పీఆర్వో నారాయణ మూర్తి పాల్గొని సేవలందించారు.

రైతులకు బోనస్ పంపిణీ



హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సహకారరంగం ద్వారా చేయూత నందిస్తూ ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నామని పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ దన్నే దుర్గారావు అన్నారు. కానుమోలు పీఏసీఎస్ ఆధ్వర్యంలో శనివారం రైతులకు బోనస్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎనికేపల్లి సీతమ్మ, డైరెక్టర్లు అచ్చన వెంకటేశ్వరరావు, ఏడుకొండలు, రైస్ మిల్లర్ల సంఘ నాయకులు పొట్లూరి సీతారాంప్రసాద్, పొట్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ అధ్యక్షుడు దన్నే మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మాజీ నేత పెద్ద బసవయ్యకు నివాళి



గన్నవరం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : యూటీఎఫ్ జిల్లా మాజీ నాయకులు దివి పెద్ద బసవయ్య (93) మృతి చెందారు. శనివారం స్థానిక చంద్రిక అయోధ్య అపార్టుమెంట్‌లో ఉంటున్న ఆయన కుమారుడు మోహన్ కుమార్ ఇంటి వద్ద పార్థివదేహానికి సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, తులసి దాస్, జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, కళ్ళం వెంకటేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ట్రెండ్



మా జీవితం మా హక్కు

కృత్రిమ మేథస్సు, సామాజిక మాధ్యమాలు విషపూరిత సమ్మేళనంగా మారిపోయాయి. మరీ ముఖ్యంగా కొందరు ఇన్‌ఫ్లూయెన్సర్లు, సంస్థలు పేరు కోసం, విక్రయాల కోసం ప్రముఖుల స్వరాలు, ఆహార్యాలను అనుకరించే పోకడను అనుసరిస్తున్నారు. ఈ పోకడ నెటిజన్లను అలరిస్తున్నా, నటులను మాత్రం ఒకింత అసహనానికి గురి చేస్తోంది. కాబట్టే తాజాగా కొందరు ప్రముఖులు వారి వ్యక్తిగత హోదానూ, హుందాతనాన్నీ పరిరక్షించుకోవడం కోసం కోర్టుల ద్వారా 'పర్సనాలిటీ రైట్స్'ను పొందుతున్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం!

ఐశ్వర్య దంపతులు సైతం

2024 మేలో, కొన్ని సంస్థలు జాకీ ష్రాఫ్ ఫొటోలను వాడుకుంటూ, అనధికారిక వస్తువుల అమ్మకాలు, వక్రీకరించిన వీడియోలతో వాణిజ్య లాభాలను ఆర్జిస్తున్నట్టు గుర్తించిన న్యాయస్థానం బాలీవుడ్ నటుడు జాకీ ష్రాఫ్ వ్యక్తిత్వ హక్కులకు కూడా రక్షణ కల్పించింది. అలాగే అనిల్ కపూర్ పేరు, ఫొటో, స్వరాలతో పాటు ఆయన సుప్రసిద్ధ క్యాచ్‌ఫ్రేజ్ 'ఝకాస్' అనే మాటను కూడా వినియోగించడానికి వీల్లేకుండా వ్యక్తిత్వ హక్కుల రక్షణను అనుమతించింది. అలాగే 2022 నవంబరులో హైకోర్టు అమితాబ్ బచ్చన్ వ్యక్తిత్వ, ప్రచార హక్కులు ఉల్లంఘనకు లోను కాకుండా రక్షణ కల్పించింది. గత సెప్టెంబరులో ప్రపంచసుందరి, బాలీవుడ్ నటి ఐశ్వర్యా రాయ్ బచ్చన్, అభిషేక్ బచ్చన్‌లతో పాటు నిర్మాత కరణ్ జొహార్‌ల వ్యక్తిత్వం, ప్రచార హక్కులకు కూడా రక్షణ కల్పించడం విశేషం. కరణ్ జొహార్ విషయంలో, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, పిన్‌ట్రెస్ట్, యూట్యూబ్‌లతో సహా వివిధ సామాజిక మాధ్యమాల వేదికల నుంచి అశ్లీల మీమ్స్, పోస్టులను తొలగించాలని కోర్టు ఆదేశించింది. అటువంటి కంటెంట్‌ను సృష్టించడం కోసం ఒక ప్రముఖుడి వ్యక్తిత్వాన్ని అనధికారికంగా ఉపయోగించడం వల్ల ఆ ప్రముఖుడి పేరు ప్రతిష్ఠలు దెబ్బతిన్నట్టు పేర్కొంది.

మధుర గాయని కూడా...



ప్రముఖ హిందీ గాయని ఆశాభోంస్లే, కృత్రిమ మేథస్సు సహాయంతో తన స్వరాన్ని దుర్వినియోగపరుస్తున్న ఎఐ కంపెనీ మింక్ ఇంక్‌తో సహా అనేక సంస్థలకు వ్యతిరేకంగా కోర్టును ఆశ్రయించారు. దాంతో ముందస్తు అనుమతి లేకుండా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వేదికలు, ఇ కామర్స్ సైట్‌లు, స్వతంత్ర విక్రేతలు ఆశాభోంస్లే స్వరాన్ని క్లోనింగ్ చేయడం లేదా ఆమె చిత్రాలు, పోలికలు, ఇతర వ్యక్తిత్వ లక్షణాలు దుర్వినియోగం కాకుండా బోంబే హైకోర్టు తాత్కాలిక రక్షణ కల్పించింది. డిజిటల్ యుగంలో ప్రముఖుల హక్కులను కాపాడే క్రమంలో న్యాయస్థానం ఇచ్చిన ఈ ఉత్తర్వు ప్రస్తుతం ఎంతో కీలకంగా మారింది.

నటుడు నాగార్జున కూడా...

పేరు, స్వరం, ఇమేజ్.. ఏ నటుడికైనా ఇవెంతో ముఖ్యం. వీటిని ఏ కారణంగా దుర్వినియోగపరిచినా ఏ నటులూ ఉపేక్షించరు. వెంటనే కోర్టును ఆశ్రయించి, వ్యక్తిత్వ హక్కులను పొందే ప్రయత్నం చేస్తారు. నటుడు నాగార్జున ఇదే చేశారు. తాజాగా తన వ్యక్తిత్వ హక్కులకు రక్షణ కల్పించాలంటూ ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించి, అనుమతి పొందారు. అక్రమ వాణిజ్య ప్రయోజనాల కోసం వస్తువులను విక్రయించడం కోసం తన వ్యక్తిత్వాన్ని దుర్వినియోగం చేస్తున్నట్టు, తన ఫొటోలను అశ్లీల ఫొటోలతో మార్ఫింగ్ చేస్తున్నట్టు, యూట్యూబ్‌లో వీడియోలు సృష్టించడం ద్వారా, కృత్రిమ మేథస్సు సహాయంతో తనను ఉగ్రవాద సంస్థలతో, జూదంతో అనుసంధానిస్తున్నట్టు నాగార్జున తన వ్యాజ్యంలో పేర్కొన్నారు. ఒక ప్రముఖ వ్యక్తి ఇమేజ్‌ను తప్పుదారి పట్టిస్తూ, అనుచితమైన, అవమానకరమైన మార్గాల్లో వారి ప్రవర్తననూ, ఆహార్యాన్నీ అనుకరిస్తూ ప్రతిష్ఠకు భంగం కలిగించినప్పుడు, వాళ్ల గుడ్‌విల్ దెబ్బ తింటుందని పేర్కొంటూ, ఢిల్లీ హైకోర్టు, నటుడు అక్కినేని నాగార్జున వ్యక్తిత్వం, ప్రచార హక్కులను కాపాడుతూనే ఆయన ప్రమేయం లేకుండా, పేరునూ, ఇమేజ్‌నూ, స్వరాన్నీ వాణిజ్యపరంగా ఉపయోగించకుండా కట్టడి విధించింది.



సండే సెలబ్రిటీ



దక్షిణాది, హిందీ సినిమాల ద్వారా ప్రేక్షకులపై తనదైన ముద్ర వేసిన హీరోయిన్ రాశీ ఖన్నా, తాజాగా ఆమె నటించిన 'తెలుసు కదా' సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఆమెను 'నవ్య' పలకరించింది.

అలాగైతే పాతబడిపోతాం...

'తెలుసు కదా' టీజర్‌కు మంచి స్పందన వచ్చింది కదా... ఎలా అనిపిస్తోంది?

చాలా ఆనందంగా అనిపిస్తోంది. సినిమాను బాగా ప్రమోట్ చేస్తున్నాం. చాలా కాలం తర్వాత నేను చేస్తున్న తెలుగు సినిమా ఇది. కాబట్టి చాలా ఎక్సైటింగ్‌గా ఉంది. నాకు హైదరాబాద్‌లో ఇల్లు ఉంది. వచ్చిపోతూ ఉంటాను. ఇక్కడ షూటింగ్ జరుగుతూ ఉంటే పుట్టింటికి వచ్చినట్లు అనిపిస్తోంది.

మీరు అనర్గళంగా మంచి తెలుగు మాట్లాడుతున్నారు... ప్రాక్టీస్ చేశారా?

చాలాకాలంగా తెలుగు సినిమాలు చేస్తున్నాను కదా! తెలుగు వచ్చేసింది. నాకు తెలుగే కాదు... తమిళం, హిందీ కూడా బాగా వచ్చు. ప్రేక్షకులతో నేరుగా కనెక్ట్ కావటానికి భాష చాలా ప్రముఖమైన పాత్ర పోషిస్తుంది. అంతేకాదు... ఇది ఆయా భాషల ప్రేక్షకులకు నేను ఇచ్చే కనీస గౌరవం.

నా తల్లితండ్రులు, మా అన్నయ్య, ఇద్దరు స్నేహితులు వీరందరూ నాకు మంచి సపోర్ట్. నాకు ఏ చిన్న సమస్య వచ్చినా వాళ్లతో చెబుతా!

మీరు హిందీ ప్రాజెక్టుల్లో కూడా నటించారు కదా... బాలీవుడ్‌కు, టాలీవుడ్‌కు ఉన్న తేడా ఏమిటి?

టాలీవుడ్‌లో హీరోయిన్లకు చాలా గౌరవం లభిస్తుంది. చాలా ఆదరంగా చూస్తారు. పైగా కాల్షీట్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల దాకానే ఉంటుంది. బాలీవుడ్‌లో కానీ, తమిళ పరిశ్రమలో కానీ కాల్షీట్ పన్నెండు గంటలు ఉంటుంది. అందువల్ల ఎక్కువగా అలసిపోతాం. అంతేకాకుండా ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. తెలుగు ప్రేక్షకులకు నా పట్ల అభిమానం ఎక్కువ. నేను ఇతర భాషల్లో చేసిన సినిమాలను కూడా వారు ఆదరిస్తూ ఉంటారు. సోషల్ మీడియాలో ప్రశంసలు కురిపిస్తూ ఉంటారు.



నేను భవిష్యత్తు గురించి పెద్దగా ఆలోచించను. ఎందుకంటే భవిష్యత్తులో ఏం జరుగుతుందో మనకు తెలియదు. చిన్నప్పుడు నేను ఐఏఎస్ ఆఫీసర్ కావాలనుకొనేదాన్ని. అనుకోకుండా హీరోయిన్ అయ్యా. ఇలా మనం అనుకున్నవన్నీ కావు.

బాలీవుడ్‌లో దక్షిణాది నటీనటుల పట్ల వివక్ష ఉందని విమర్శలు వినిపిస్తూ ఉంటాయి...

నాకు అలాంటి ఫీలింగ్ ఎప్పుడూ రాలేదు. అంతేకాదు, ఓటీటీ వచ్చిన తరువాత భాషపరమైన సమస్యలు తొలగిపోయాయి. ఇక్కడ హిందీ సినిమాలు, వెబ్ సిరీస్‌లు చూస్తున్నారు. అక్కడ దక్షిణాది సినిమాలు చూస్తున్నారు. ఓటీటీలు వచ్చిన తర్వాత మంచి నటులకు అన్ని భాషల్లోను అవకాశాలు లభిస్తున్నాయి.

నటనపై మీ అభిప్రాయమేమిటి?

నటనను ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ ఉండాలి. నేను సినిమా రంగానికి వచ్చినప్పుడు నాకు ఏదీ తెలియదు. మనసుకు ఎలా అనిపిస్తే అలా నటించేదాన్ని. ఆ తర్వాత నటనకు కొన్ని టెక్నిక్స్ ఉంటాయని తెలిసింది. పుస్తకాలు చదవటం మొదలుపెట్టా. వీడియోలు చూసేదాన్ని. ముంబాయిలో నాటక రంగంలో పనిచేశా. ఎప్పటికప్పుడు నేర్చుకోపోతే ప్రేక్షకులకు బోర్ కొడుతుంది. మనం పాతపడిపోతాం!

ఒక నటిగా నాకు ఎప్పుడూ అభద్రతా భావం లేదు. నన్ను నేను ఎవ్వరితోను పోల్చుకోను. ప్రతి వ్యక్తికి తనదైన జర్నీ ఉంటుంది.

మీరు స్క్రిప్టులు ఎలా ఎంపిక చేసుకుంటారు?

నేను చాలా జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటా. నా పాత్ర ఎలా ఉందనే విషయంపైనే ఎక్కువ దృష్టి పెడతా! కొన్నిసార్లు డైరక్టర్లు వచ్చి కథలు చెబుతారు. వాళ్ల దగ్గర స్క్రిప్ట్ ఉండదు. అలాంటప్పుడు చాలా ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కొన్నిసార్లు ఇతర కారణాల వల్ల కూడా ప్రాజెక్టులు ఓకే చేస్తా. కొందరు డైరక్టర్లకు మంచి దార్శనికత ఉంటుంది. అలాంటప్పుడు ఎలాంటి సమస్య ఉండదు. వారు చెప్పినట్లు చేసేస్తాను. కొందరు వచ్చి సలహాలు అడుగుతారు. నాకు తెలిసినంత చెబుతాను.

మీకు ఏ తరహా పాత్రలు చేయాలని ఉంది?

నాకు హారర్ ఫిల్మ్ చేయాలని ఉంది. ఎందుకంటే నాకు హారర్ సినిమాలంటే ఇష్టం. మైథాలజీ, యాక్షన్ ఫిల్మ్ కూడా చేయాలని ఉంది.

నాకు ఓషో అన్నా, బ్రహ్మకుమారిల మార్గమన్నా ఇష్టం. ఆధ్యాత్మికతపై నాకు అవగాహన ఉంది. నేను ఈ పరిశ్రమలో నెగ్గుకురావటానికి అది కూడా ఒక కారణం. నేను ఏ పనిచేసినా నిబద్ధతతో చేస్తా. అయితే ఫలితాలు నా చేతిలో ఉండవనే విషయం కూడా నాకు తెలుసు.

మీరు సినిమాలూ చేశారు, వెబ్ సిరీస్‌లూ చేశారు. రెండింటి మధ్యా తేడా ఏమిటి?

కొంత తేడా ఉంది. వెబ్ సిరీస్‌లలో పాత్రల్లో అనేక కోణాలు ఉంటాయి. వాటిని చూపించటానికి ఎక్కువ సమయం ఉంటుంది. సినిమాల్లో అంత సమయం దొరకదు. అయితే నాకు సినిమాలంటేనే ఇష్టం.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

అమ్మో ఐ బొమ్మ


ప్రపంచంలో సినిమాను ప్రేమించే ప్రేక్షకులు ఉన్నంత కాలం, పైరసీ అనే భూతం వెంటాడుతూనే ఉంటుంది. ముఖ్యంగా తెలుగు సినీ పరిశ్రమను వణికిస్తున్న అలాంటి పైరసీ వెబ్‌సైట్లలో 'ఐ బొమ్మ' ఒకటి. ఈ పేరు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. కొత్త సినిమా థియేటర్లలో విడుదలైన కొద్ది గంటల్లోనే, లేదా ఓటీటీలోకి వచ్చిన మరుక్షణమే హై - క్వాలిటీ ప్రింట్‌తో ఈ సైట్‌లో ఉచితంగా అందుబాటులోకి వస్తోంది. అయితే ఈ ఉచిత వినోదం తెలుగు సినిమా నిర్మాతలకు రూ. వేల కోట్ల నష్టం తెస్తోంది.

పైరసీ మాఫియా

'మూవీ రూల్స్, ఐ బొమ్మ లాంటి సైట్స్ కేవలం సినిమాలను అప్‌లోడ్ చేసే వేదికలు మాత్రమే కాదు. దీని వెనుక ఒక పకడ్బందీ వ్యవస్థ ఉంది. అంతర్జాతీయ నెట్‌వర్క్ పనిచేస్తోంద'ని సైబర్ క్రైమ్ పోలీసులు చెబుతున్నారు. పైరసీ వల్ల తెలుగు సినీ పరిశ్రమకు వేల కోట్ల నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు. ఒక్క 2024లోనే పైరసీ వల్ల తెలుగు చిత్ర పరిశ్రమకు రూ. 3700 కోట్ల భారీ నష్టం వాటిల్లిందని మాజీ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

చిన్న సినిమాల పాలిట విలన్

భారీ బడ్జెట్ చిత్రాలు, పాన్ ఇండియా చిత్రాలకు ఓటీటీ, శాటిలైట్ హక్కుల ద్వారా కొంతమేర నష్టం తగ్గినా, పైరసీ వల్ల అత్యధికంగా నష్టపోతున్నది మాత్రం చిన్న సినిమాలే. పలు సందర్భాల్లో చిన్న నిర్మాతలు, దర్శకులు వెలిబుచ్చిన ఆవేదన దీనికి అద్దం పడుతోంది. 'మా కలలను, మా పెట్టుబడినీ పైరసీ చంపేస్తోంది. మా పెట్టుబడిలో ఒక్క పైసా కూడా తిరిగి రావడం లేదు. ఇది ఇలాగే కొనసాగుతూ ఉంటే మరో సినిమా ఎలా తీయగలం' అని చిన్న నిర్మాతలు, దర్శకులు ప్రశ్నిస్తున్నారు. థియేటర్ల ద్వారా పెట్టుబడిలో కొంతైనా రాబట్టుకోవాలని చూసే చిన్న నిర్మాతల ఆశలపై ఐ బొమ్మ నీళ్లు చల్లుతోందనడంలో సందేహం లేదు. అలాగే పైరసీ అనేది థియేటర్ల ఆదాయంతో పాటు ఓటీటీ రెవెన్యూను సైతం దెబ్బతీస్తోంది. థియేటర్లలో విడుదలతో పాటు ఓటీటీల ఆదాయానికి ఐ బొమ్మ లాంటి సైట్లు గండికొడుతున్నాయి.



పోలీసులకు సవాల్

తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఐ బొమ్మతో సహా 65కు పైగా పైరసీ వెబ్‌సైట్లపై దర్యాప్తును ముమ్మరం చేశారు. ఐ బొమ్మపై దృష్టి సారించిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ నెట్‌వర్క్‌లో భాగమైన కొందరు ఏజెంట్లను అదుపులోకి తీసుకున్నారు. దాని నిర్వాహకులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ పైరసీ రాకెట్ హైదరాబాద్‌తో పాటు దుబాయ్, నెదర్లాండ్ వంటి విదేశీ ప్రాంతాల నుంచి పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పైరసీముఠా కొన్ని ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, రికార్డింగ్, ఎడిటింగ్, అప్‌లోడింగ్, మానిటైజేషన్ చేస్తున్నట్లు వెల్లడించారు.

ఛేజింగ్ గేమ్

ఐ బొమ్మ లాంటి పైరసీ సైట్లు తమ డొమైన్లను తరచూ మార్చడం, సర్వర్లు విదేశాల్లో ఉండడం వల్ల వాటిని శాశ్వతంగా మూసివేయడం పోలీసులకు, పైరసీ సెల్‌లకు పెద్ద సవాల్‌గా మారింది. ఒక డొమైన్‌ను బ్లాక్ చేస్తే కొద్ది రోజుల్లోనే అది కొత్త పేరుతో కొత్త లింక్‌తో మళ్లీ ప్రత్యక్షమవుతోంది. ఇంటర్నెట్ ప్రపంచంలో ఇదొక అంతుచిక్కని 'ఛేజింగ్ గేమ్'గా మారిపోయింది.

పరిష్కారం ప్రేక్షకులు చేతుల్లోనే!

పైరసీని పూర్తిగా రూపుమాపడం కష్టమే అయినా, సినీ పరిశ్రమ, ప్రభుత్వం, ప్రేక్షకులు కలసి పోరాడాల్సిన అవసరం ఉంది. అయితే ముఖ్యంగా మారాల్సింది ప్రేక్షకులే. పైరసీ లింక్‌లను ప్రోత్సహించకుండా, నాణ్యమైన వినోదం కావాలంటే థియేటర్లలో చూడడం, చట్టబద్ధమైన ఓటీటీ వేదికలను ఆదరించడం ఒక్కటే ఈ భూతం నుంచి తెలుగు సినిమాను రక్షించే మార్గం. వేల మంది కళాకారులు, సాంకేతిక నిపుణుల కష్టం, కలలకు ప్రతిరూపమైన సినిమాను పైరసీ కోరల నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది.





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ట్రూ హంటింగ్	వెబ్‌సిరీస్	అక్టోబర్ 06
వార్ 2	హిందీ చిత్రం	అక్టోబర్ 09
ది ఉమన్ ఇన్ కేబిన్	హాలీవుడ్ మూవీ	అక్టోబర్ 09
కురుక్షేత్ర	హిందీ సిరీస్	అక్టోబర్ 10
అమెజాన్ ప్రైమ్		
మెయింటనెన్స్ రిక్వైర్డ్	ఒరిజినల్ మూవీ	అక్టోబర్ 08
జాన్ కేండీ	డాక్యూ మూవీ	అక్టోబర్ 10
జియో హాట్‌స్టార్		
మిరాయ్	తెలుగు చిత్రం	అక్టోబర్ 10
సెర్చ్: ది నైనా మర్డర్ కేస్	హిందీ సిరీస్	అక్టోబర్ 10

రంగురంగుల గాజులతో రమ్యంగా..

ఆభరణాలన్నింటిలో గాజులకు ప్రత్యేక స్థానం ఇస్తుంటారు మహిళలు. ఎన్ని నగలు పెట్టుకున్నా.. అందమైన గాజులు వేసుకోకపోతే అలంకరణ పూర్తికానట్టే! ఒకప్పుడు.. పెళ్లయిన మహిళలు చేతినిండా మట్టిగాజులు వేసుకునేవారు. యువతులు రంగురంగుల లక్క గాజులు, ప్లాస్టిక్ లేదా నైలాన్ గాజులు వేసుకునేవారు. క్రమంగా బ్లాక్ మెటల్, వైట్ మెటల్ బ్యాంగిల్స్ వచ్చేశాయి. ఇవి కాలేజీ యువతులను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. ఇక బంగారు గాజులు ఎప్పటికీ ప్రత్యేకమే. వాటిమీద కెంపులు, పచ్చలు, వజ్రాలు, ముత్యాలు, నీలాలు పొదిగి ఎన్నో అద్భుతమైన డిజైన్లను అందుబాటులోకి తెస్తున్నారు. వీటిని కేవలం పండుగలు, వివాహాది శుభకార్యాలకు మాత్రమే పరిమితం చేస్తున్నారు మహిళలు. రోజువారీ వేసుకోవడానికి వీలుగా మారుతున్న పోకడలకు అనుగుణంగా రకరకాల రాళ్ల గాజులు, థ్రెడ్ బ్యాంగిల్స్ అందుబాటులోకి వచ్చేశాయి. సీజెడ్, టోరమలీన్, టోపాజ్ లాంటి మామూలు రాళ్లతో డిజైన్ చేసిన గాజులను మహిళలు ఎక్కువగా ఆదరిస్తున్నారు. డ్రెస్‌కు మ్యాచ్ అయ్యేలా రంగుల దారాలు చుట్టిన గాజులు కూడా యువతులను ఆకర్షిస్తున్నాయి. కాలేజీకైనా కార్యాలయానికైనా వెళ్లేటప్పుడు చేతికి ఒక్క గాజు వేసుకుంటే చాలనుకుంటున్నారు. అంతలా మహిళల మనసు దోచుకున్న రంగురంగుల గాజులపై ఓ లుక్కేద్దామా...





దారాల గాజులు

ప్లాస్టిక్, లేదా మెటల్ బ్యాంగిల్స్‌కు రంగు రంగుల పట్టుదారాలను ఒక క్రమంలో చుట్టి కొనలను గమ్‌తో అంటిస్తారు. రెండు లేదా మూడు రంగుల దారాలను అందమైన డిజైన్ ప్రకారం చుట్టి తయారుచేసిన గాజులు గ్రాండ్‌గా కనిపిస్తాయి. వీటి మీద రంగురంగుల కుందనాలు, రాళ్లు, ముత్యాలు, బీడ్స్ కూడా అతికిస్తుంటారు. మువ్వలు వేలాడదీస్తుంటారు. సన్నగా, వెడల్పుగా లేదంటే లావుగా ఇలా ఏ ఆకారంలో కావాలంటే అలా ఇంట్లోనే దారాల గాజులు తయారు చేసుకోవచ్చు. గోట్స్ సైడ్ బ్యాంగిల్స్ మాదిరిగా డిజైన్ చేసుకుని చేతులకు వేసుకుంటే నలుగురిలో ప్రత్యేకంగా కనిపిస్తారు. ఎరుపు, పసుపు, ఆకుపచ్చ, నీలం రంగుల దారాలతో లావుపాటి గాజులు సిద్ధం చేసుకుంటే రోజువారీ వేసుకోవడానికి బాగుంటాయి.

సీజెడ్ గాజులు

వజ్రాలకు ప్రత్యామ్నాయంగా సీజెడ్స్ ఉపయోగించి తయారుచేసే రాళ్ల గాజులను యువతులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ప్రస్తుతం వివిధ రంగుల్లో సీజెడ్స్ లభ్యమవుతున్నాయి. ఒక గ్రాము బంగారం లేదా వెండి ప్లేటింగ్‌తో పలు డిజైన్లలో రంగురంగుల సీజెడ్‌లను కూర్చి గాజులు రూపొందిస్తున్నారు. సింగిల్ లైన్, మల్టిపుల్ లైన్స్, బ్రేస్‌లెట్ స్టయిల్ గాజులు అందుబాటులో ఉన్నాయి. వజ్రాలను పోలిన కటింగ్‌తో తళతళలాడే సీజెడ్ గాజులు... సంప్రదాయ దుస్తులతోపాటు మోడరన్ డ్రెస్‌ల మీద కూడా చక్కగా నప్పుతాయి.



టోరమలీన్ గాజులు

టోరమలీన్ రాళ్లు పొదిగిన గాజులు ప్రత్యేకంగా కనిపిస్తాయి. విభిన్నమైన కటింగ్ విధానం వల్ల ఈ రాళ్లు నలువైపులా కాంతులు విరజిమ్ముతుంటాయి. గులాబీ, ఎరుపు, ఆకుపచ్చ, నీలం, నలుపు, గోధుమ రంగుల్లో లభించే టోరమలీన్ రాళ్ల గాజులను మహిళలు ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు. పట్టుచీరలు లేదా భారీ ఎంబ్రాయిడరీ వర్క్‌లతో నిండిన లెహంగాల మీద ఇవి ఆకర్షణీయంగా కనిపిస్తాయి. రోజువారీ వేసుకోవడానికి కూడా సౌకర్యవంతంగా ఉంటాయి.





టోపాజ్ గాజులు

రంగురంగుల టోపాజ్ రాళ్లను కూర్చి రూపొందించిన గాజులు కూడా మహిళలను ఆకట్టుకుంటున్నాయి. లక్క, ప్లాస్టిక్, మెటల్ గాజుల మీద పలు ఆకారాల్లో ఉన్న టోపాజ్ రాళ్లను అతికిస్తారు. నీలం, గులాబీ, ఆకుపచ్చ, పసుపు రంగుల్లో చిన్న, పెద్ద సైజుల్లో ఉన్న టోపాజ్ రాళ్లతో చాలా రిచ్‌గా కనిపిస్తాయి ఈ గాజులు. వెడల్పుగా గోట్ మాదిరి కనిపించే ఈ గాజులను చేతికి ఒక్కటి వేసుకున్నా గ్రాండ్‌గా ఉంటుంది.

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)



బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

వైభవంగా విజయదుర్గ అమ్మవారి నగరోత్సవం

గుడివాడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నీలామహల్ రోడ్డులోని శ్రీవిజయదుర్గ అమ్మవారి దేవస్థానంలో ఘనంగా శ్రీదేవి శరన్నవరాత్ర మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం అమ్మవారి నగరోత్సవ ఊరేగింపును అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవస్థాన సంప్రదాయం ప్రకారం అమ్మవారికి పూజా పువ్వులు, ఉత్సవచీరను దక్కించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. ఉత్సవ రథంపై నిర్వహించిన ఊరేగింపును చూసేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ వై.హరిబాబు, కార్యనిర్వహణాధికారి గంగు శిరీష, పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

విద్యార్థుల మనసెరిగి బోధన చేయాలి

▸ కలెక్టర్ బాలాజీ

పామర్రు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించిన వారు విద్యార్థుల మనసెరిగి విద్యాబోధన చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. స్థానిక ప్రగతి డీఎస్సీ కోచింగ్ కేంద్రంలో నూతన ఉపాధ్యాయులకు జరుగుతున్న ప్రత్యేక శిక్షణ తరగతులను ఆయన శనివారం పరిశీలించారు. ఈకార్యక్రమంలో పలువురు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు. సమాజానికి మంచి పౌరులను అందించాల్సిన బాధ్యతను నూతనంగా కొలువుదీరిన ఉపాధ్యాయులు తీసుకోవాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. స్థానిక ప్రగతి డీఎస్సీ కోచింగ్ కేంద్రంలో ఉపాధ్యాయులకు ప్రారంభమైన శిక్షణ తరగతులను శనివారం డీఈవో రామారావుతో కలసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి విద్యాసంస్థల అధినేత సనకా పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

జంతువులను ప్రేమతో అక్కున చేర్చుకోవాలి : లింగమనేని

కూచిపూడి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : జంతువులను ప్రేమతో అక్కున చేర్చుకుని వాటి ఆలనాపాలనా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిదని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వర రావు అన్నారు. ప్రపంచ జంతు సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెదముత్తేవిలోని శ్రీకృష్ణాశ్రమంలోని గోశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రామలింగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువుల సంక్షేమం, వాటి మనుగడకు కృషి చేయటంతోపాటు జంతువుల పట్ల క్రూరత్వం చూపరాదన్నారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎం.మోర్ల సత్యేంద్ర, ప్రభావతి, శ్రీను, భాస్కర్, గోశాల సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



పెదముత్తేవి ఆశ్రమంలో జంతు సంక్షేమ దినోత్సవంలో పాల్గొన్న లింగమనేని, పశువైద్యులు



మాట్లాడుతున్న ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

▸ ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం

గుడివాడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఏ రకం వరిని సాగు చేస్తున్నారో, ఎంత విస్తీర్ణంలో పంట పండిస్తున్నారో పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని, రైతులుకు కావలసిన గోనె సంచులను ముందుగానే అందుబాటులో ఉంచాలని ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో కలెక్టర్ బాలాజీ ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ముఖ్యంగా దళారీ వ్యవస్థకు అవకాశం లేకుండా ధాన్యం కొనుగోలు జరగాలన్నారు. ప్రతి కో-ఆపరేటివ్ సొసైటీల వద్ద గ్రామస్థాయి, మండల స్థాయి అధికారుల ఫోన్ నెంబర్ల వివరాలు రైతులకు స్పష్టంగా కనిపించే విధంగా ప్రదర్శించాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

పెదపారుపూడి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): బయట దొరికే జంక్ ఫుడ్‌లు తినకూడదని పంచదార, ఆయిల్ తక్కువగా వాడాలని అంగన్వాడీ సూపర్‌వైజర్ అరుణ కుమారి అన్నారు. శనివారం దూళ్లవానిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం ఇస్తున్న పోషకాహారాలను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ అరుణకుమారి

ఉచిత వైద్యశిబిరం నేడు

గుడివాడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో డా.తిపిర్నేని లక్ష్మీపెరుమాళ్ళు, ప్రభావతి, చలసాని రాయన్ చౌదరిల జ్ఞాపకార్థం ఈ నెల 5వ తేదీ ఆదివారం స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లోని ప్రభావతి గార్డెన్స్‌లో డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల, ఆసుపత్రి వైద్యులు సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వై.నాగేశ్వరరావు, జి.కిరణ్‌బాబులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్యశిబిరంలో పలు వైద్యసేవలను అందించనున్నామని, వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేస్తామని వారు తెలిపారు.

ఎస్సీల సంక్షేమానికి కృషి చేయండి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన ఎస్సీల సంక్షేమం కోసం కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాల సంక్షేమ సహకార ఆర్థిక సంస్థ చైర్మన్ డా. పెదపూడి విజయ్‌కుమార్ కోరారు. శనివారం ఆర్అండ్‌బీ అతిథి గృహానికి వచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాల సంక్షేమ సహకార ఆర్థిక సంస్థ చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్‌ను జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు గుమ్మడి విద్యాసాగర్ కలసి ఎస్సీల హక్కుల పరిరక్షణపై చర్చించారు. నిరుద్యోగ ఎస్సీ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని కోరారు.

ఆటోవాలలకు ఆర్థిక భరోసా

▸ ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, వర్ల కుమార్ రాజా

గుడివాడ రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలు కష్టాలు తెలిసిన వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు అని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం గుడివాడ మార్కెట్ యార్డులో ఆటో డ్రైవర్లకు చెక్కులు, బ్రోచర్లు అందజేశారు. ముందుగా రైల్వేస్టేషన్ నుంచి వెనిగండ్ల రాము ఆటో నడుపుతూ భారీ ఎత్తున ర్యాలీ నిర్వహిస్తూ గుడివాడ మార్కెట్ యార్డుకు చేరుకున్నారు. ఆటో డ్రైవర్లతో మమేకమై వారి సమస్యలు తెలుసుకున్నారు. గుడివాడ నియోజకవర్గంలో 1543 మంది ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ.2.31 కోట్ల నగదు వారి ఖాతాలో జమ అయినట్లు తెలిపారు. డ్రైవర్ల సంక్షేమం కోసం ఉమ్మడి ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. కనీసం రహదారులు కూడా బాగు చేయకపోవటంతో ఆటోలకు మరమ్మతులకు గురయ్యాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం డ్రైవర్ల సంక్షేమానికి కృషి చేస్తుందని తెలిపారు. ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, గుడివాడ మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, బీజేపీ నాయకులు అంగడాల సతీష్, కొసరాజు బాపయ్య చౌదరి, గోకవరపు సునీల్, పిన్నమనేని బాబ్జీ, చేకూరి జగన్మోహనరావు, లింగం ప్రసాద్, గోకవపరపు సునీల్, కొండాలమ్మ గుడి చైర్మన్ ఈడే మోహన్, దింట్యాల రాంబాబు, వాసే మురళీ, గోర్జి సత్యనారాయణ, వివిధ యూనియన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆటో నడుపుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

● పామర్రు : అర్హతగల ఆటో, మాక్సీ డ్రైవర్లకు వాహనమిత్ర పథకం ద్వారా ఆర్థిక చేయూతనందించి, వారి కుటుంబ జీవన ప్రమాణానికి భరోసా కల్పిస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం నియోజకవర్గ స్థాయి వాహనమిత్ర లబ్ధిదారులకు ఆర్థికసాయం అందించే కార్యక్రమాన్ని ఉయ్యూరు మోటార్ వేహికల్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్ల సేవ పేరుతో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వర్లతోపాటు రాష్ట్ర నాటక మండలి చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అన్ని వర్గాలకు అందిస్తున్నామన్నారు. నాటక మండలి చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ, ఆటోడ్రైవర్లను ఆర్థిక కష్టాల నుంచి విముక్తుల్ని చేసేందుకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వాహన మిత్ర పథకాన్ని అర్హతగల వారంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి మాట్లాడుతూ, ఆటోవాలల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలతో నేడు ఎంతో ఆనందంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు, పామర్రు నియోజకవర్గ ప్రత్యేకాధికారి పిశివప్రసాద్‌యాదవ్, జిల్లా ప్రాజెక్టు కమిటి వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారం

తోట్లవల్లూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధిగాంచిన తోట్లవ ల్లూరు శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానం ట్రస్టుబోర్డు ప్రమాణ స్వీకారం శనివారం రాత్రి జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, ఈవో హరిదుర్గా నాగేశ్వరరావు ట్రస్టుబోర్డు చైర్మన్ గురజాల లక్ష్మీనారాయణ, సభ్యులు శివలెంక శశిధర్ ప్రసాద్, తుమ్మిడి శివకుమార్, ఆకునూరి శివలక్ష్మీ, యార్లగడ్డ శివసుధ, వల్లూరి కోటేశ్వరమ్మ, కాటూరి మల్లేశ్వరీ, గోరిపర్తి వెంకట శివరావు, పాగోలు రాజ్‌కుమార్, వీరంకి కృష్ణారావు, గరికే బిందురాణి చేత ప్రమాణ స్వీకారం చేయించి భక్తులకు మంచి సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్ ప్రసాద్, కళ్ళం వంశీకృష్ణారెడ్డి, రామినేని కుటుంబయ్య పలు గ్రామాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నిరాశ్రయుల కేంద్రంలో వృద్ధులకు భోజన వసతి

గుడివాడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మందపాడులోని నిరాశ్రయుల కేంద్రంలో ఆకునూరి వెంకట్రావు వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబసభ్యులు సహకారంతో శనివారం వృద్ధులకు భోజన వసతి కల్పించారు. బీజేపీ టూటౌన్ అధ్యక్షులు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) పాల్గొని వృద్ధులకు భోజనం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రయం మేనేజర్ లంకపల్లి పురుషోత్తం, బీజేపీ నాయకులు లంకా రాంబాబు, గాదె చరణ్ తదితరులు పాల్గొన్నారు.



కర్ల వృద్ధాశ్రమంలో భోజనం అందజేస్తున్న శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం సభ్యులు

శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో..

ముదినేపల్లి మండలం పేరూరు గ్రామానికి చెందిన సోమ సత్యనారాయణ, రామలక్ష్మి దంపతుల కుమారుడు సోమ శ్రీరామ్‌కుమార్ జన్మదినం సందర్భంగా శనివారం శ్రీకృష్ణయాదవ సేవాసంఘం ఆధ్వర్యం లో స్థానిక కర్ల వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షులు వీర్ల వెంకటేశ్వరరావు, సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరికుమార్, సభ్యులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు.. పేదలకు ఉపశమనం

▸ ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పెదపారుపూడి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ తగ్గింపు ద్వారా ప్రజలకు ఎంతో ఉపశమనం లభిస్తుందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మండల కేంద్రమైన పెదపారుపూడిలోని పీఏసీఎస్ వద్ద జీఎస్టీపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ, జీఎస్టీ తగ్గింపు ద్వారా వ్యాపారులు కూడా అభివృద్ధి సాధిస్తారన్నారు. సీఎం చంద్రబాబు, ప్రధాని మోదీ తీసుకున్న ఈ నిర్ణయం ప్రజలకు మేలు కలిగించే చారిత్రాత్మక అడుగు అని తెలిపారు. ముఖ్యంగా కూలీలు, రైతులు, చిరు వ్యాపారులు, మధ్య తరగతి ప్రజల జీవన వ్యయాలు తగ్గుతాయని, ఇదే సమయంలో వ్యాపార రంగం ఊపిరి పీలుస్తుందన్నారు. ఉత్పత్తి ఖర్చులు తగ్గటంతో వస్తువుల ధరలు తగ్గి వినియోగదారులకు లాభం చేకూరుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన ప్రాజెక్టు అధికారి జ్యోతి, డీపీటీ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.సునీత, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.వి.శివప్రసాద్ యాదవ్, సర్పంచ్ చప్పిడి సమీర, నాయకులు చిలకా ఆంజనేయులు, నాగన్న బోయిన గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు జంతువులు అవసరం

▸ జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ నరసింహులు

గుడివాడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : జంతువుల మానవ మనుగడకు, భూగోళ ఆరోగ్యానికి ఎంతో అవసరమని జిల్లా పశు వైద్యాధికారి డా.ఎన్.సి.హెచ్ నరసింహులు అన్నారు. శనివారం స్థానిక రావి వీరభద్రయ్య బహుళార్థ పశువైద్యశాలలో ప్రపంచ జంతు దినోత్సవం సందర్భంగా జంతువుల ప్రాముఖ్యత, ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జంతువులు పరిసరాలను సమతుల్యం చేయడానికి, శక్తినిచ్చే వాయువులను విడుదల చేస్తాయన్నారు. వ్యవసాయ దిగుబడికి కావలసిన బలం ఇచ్చే ముఖ్యమైన ప్రాణులను గౌరవించి, కాపాడాలని, సంరక్షించాలన్నారు. డివిజనల్ ఉపసంచాలకులు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, జంతు సంరక్షణ, సంక్షేమం, గౌరవ సంప్ర దాయాల గురించి పాఠశాలలు, కళాశాలలు, కార్పొరేషన్‌లో అవగాహన కల్పించాలన్నారు. బహుళార్థక వైద్యశాల ఉపసంచాలకులు డా.పి.రత్నశ్రీ మాట్లాడుతూ గోశాలలను నిర్మించి, నీటి తొట్టెలను నిర్మించి, జంతువులకు వైద్యసేవలద్వారా సకాలంలో అందుబాటులో ఉండి రక్షణ కల్పించాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రణవాశ్రమంలోని 50 ఆవులకు కావలసిన మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, హనుమంత రావు, తదితరులు పాల్గొన్నారు.



పశువులను పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి నరసింహులు

పాఠశాలకు స్థలం లేక పాట్లు

గుడివాడ రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ రూరల్ మండలం మల్లాయిపాలెం పరిధిలోని బాలకృష్ణ నగర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాల స్థలం లేక గత 15 సంవత్సరాల నుంచి అద్దె గృహాల్లో కొనసాగింది. ఇప్పుడు అద్దె గృహాలు కూడా దొరకకపోవటంతో పిన్నమనేని నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతం కొనసాగుతుంది. బాలకృష్ణనగర్‌లో 23 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారికి నిధులు ఉన్నప్పటికీ స్థలం లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి స్థలం కేటాయించాలని పలువురు కోరుతున్నారు. ఎంఈవో బాలాజీని వివరణ కోరగా, ప్రస్తుతం పాఠశాల పిన్నమనేని నగర్‌లో ఉన్న ఖాళీగా ఉన్న భవనంలో కొనసాగుతుందని, స్థలం అవసరమని జిల్లా స్థాయి అధికారులకు లిఖితపూర్వకంగా పంపించామని ఆయన తెలిపారు.



పిన్నమనేని నగర్‌లో ఉన్న పాఠశాల

ఊరుటూరులో చోరీ

పామర్రు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఓ వృద్ధురాలి ఇంట్లోకి దొంగలు చొరబడి ఇంట్లోని బీరువాలోగల రూ.90వేల నగదుతోపాటు, దేవుడిపూజకు ఉపయోగించే వెండి ఆభరణ వస్తువులు దాదాపు రూ. 30వేల విలువగలవి దొంగిలించుకుపోయారు. మండల పరిధిలోని ఊరుటూరులో జరిగిన ఈ చోరీపై బాధిత మహిళ ముప్పిడి శివకుమారి(64) వెల్లడించిన వివరాల మేరకు.. ఈ నెల 1న ఎన్టీఆర్ భరోసా పింఛను అందుకుని తన ఇంటికి తాళం వేసి నెల్లూరు జిల్లా కావలిలో నివాసముంటున్న కూమార్తె కల్యాణిరెడ్డి వద్దకు వెళ్లింది. దొంగతనం జరిగిన సమాచారాన్ని శుక్రవారం సాయంత్రం గ్రామస్తులు తెలపడంతో శనివారం గ్రామానికి కుమార్తెతో కలసి వచ్చారు. ఇంటి ముఖద్వారం తాళం పగలుగొట్టి దొంగలు లోపలికి ప్రవేశించి బెడ్ రూమ్‌లోని బీరువా తాళాలు పగలుగొటి దానిలో ఉన్న రూ. 90వేల నగదుతోపాటు, దేవునిపూజకు ఉపయోగించే వెండి వస్తువులను అపహరించుకుపోయినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

నేడు ఉచిత వైద్య శిబిరం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మణిపాల్ హాస్పిటల్ సహకారంతో జైహింద్ హైస్కూల్‌లో ఆదివారం ఉదయం ఉచిత వైద్య సేవా శిబిరాన్ని బ్రాహ్మణ సేవా సంఘం నిర్వహిస్తోందని, నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ సూచించారు. శనివారం తన కార్యాలయంలో వైద్య శిబిరం కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. రక్త పోటు, మధుమేహం, ఈసీజీ, గుండె సంబంధిత పరీక్షలు చేస్తారని తెలిపారు. బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు కానుకొలను ఫణికిరణ్, చోడవరపు లక్ష్మీప్రసూన, పి.వి.ఫణికుమార్, ఆర్వీఎస్ మురళీధర్, పి.ఎస్.ఎస్.ధర్మ తదితరులు పాల్గొన్నారు.



మన కోసం మనం ట్రస్ట్ లోగోను ఆవిష్కరిస్తున్న ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, అతిథులు (ఫైల్)

స్వచ్ఛ ఎన్జీవోగా
మన కోసం మనం ట్రస్ట్

● స్వచ్ఛాంధ్ర జిల్లా కేటగిరీలో అవార్డు

చల్లపల్లి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సుందర చల్లపల్లి సాధన కోసం చల్లపల్లి గ్రామ అభివృద్ధి, సుందరీకరణకు సహకారం అందిస్తున్న మన కోసం మనం ట్రస్ట్‌కు రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ ఎన్జీవో అవార్డును ప్రకటించింది. ఈనెల 6వతేదీన ముఖ్యమంత్రి అవార్డు ప్రదానం చేయనున్నారు. 2015 నవంబరు 26వ తేదీన మన కోసం మనం ట్రస్ట్ ఏర్పాటైంది. ప్రముఖ వైద్యులు డీఆర్కే ప్రసాద్- పద్మావతి దంపతుల నేతృత్వంలో స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమం ఏడాది పూర్తయిన తర్వాత గ్రామాన్ని గానగంధర్వ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సందర్శించి, ఆయన చేతులమీదుగా ట్రస్ట్‌ను ఆవిష్కరించారు. నాటి నుంచి పదేళ్లుగా ట్రస్ట్ ఆధ్వర్యంలో చల్లపల్లిలో ఎన్నో నిర్మాణాలు జరిగి, సుందరప్రదేశాలుగా రూపుదిద్దుకున్నాయి. స్మశానవాటిక అభివృద్ధి, సంపద తయారీకేంద్రం, పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం, మినీ గార్డెన్లు, బస్టాండ్ అభివృద్ధికి ట్రస్ట్ సహకారం అందించింది. మొక్కలు నాటడం, సంరక్షణ, రోజువారీ ఉద్యోగులకు జీతభత్యాల చెల్లింపులు ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. డాక్టర్ పద్మావతి ప్రతినెలా సుమారు మూడు లక్షల రూపాయలు ఉద్యోగులు జీతాలు చెల్లిస్తుంటారు. డీఆర్కే ప్రసాద్ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ట్రస్ట్‌కు మూలస్తంభాలుగా నిలుస్తూ స్వచ్ఛ చల్లపల్లికి ఇతోధిక సహకారం అందిస్తున్నారు. ప్రముఖులు, ప్రజలు తమవంతు భాగస్వామ్యం అందిస్తున్నారు.

పోతేపల్లికి స్వచ్ఛ పంచాయతీ అవార్డు



పోతేపల్లిలోని చెత్త నుంచి సంపద ఉత్పత్తి కేంద్రం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): బందరు మండలం పోతేపల్లి గ్రామ పంచాయతీని జిల్లాస్థాయిలో స్వచ్ఛ గ్రామ పంచాయతీగా ప్రభుత్వం ప్రకటించింది. పంచాయతీలో నిర్వహిస్తున్న ఘన వ్యర్థాలను ఇంటింటికీ సేకరించడం, తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించడం, సంపద ఉత్పత్తి కేంద్రం నిర్వహించడం, ఇళ్లలో కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేయాలని ప్రోత్సహించడం వంటి కార్యక్రమాల వల్ల ఈ పంచాయతీ అవార్డుకు ఎంపికయింది. కలెక్టర్ డీకే బాలాజీ ఇటీవల పంచాయతీని సందర్శించి ప్రశంసించారు. అవార్డు రావడంపై పంచాయతీ కార్యదర్శి నరసింహారావును పలువురు నాయకులు అభినందించారు.

వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

అవనిగడ్డ రూరల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పులిగడ్డ పల్లెపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారుడు సింగోతు నాగూర్(60) శుక్రవారం వేట కోసం కాలువ దగ్గరికి వెళ్లి ప్రమాదవశాత్తూ జారి కాలువలో పడిపోయాడు. శనివారం ఉదయం మృతదేహం లభ్యమైంది. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. అవనిగడ్డ ఎస్సై కె.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ఏరియా ఆస్పత్రికి తరలించారు.



ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావుకు వినతిపత్రం ఇస్తున్న ముక్కొల్లు, షా అబ్దుల్లాపాలెం గ్రామస్థులు

రోడ్డు నిర్మాణానికి
నిధులు మంజూరు చేయించండి

గూడూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ముక్కొల్లు నుంచి షా అబ్దుల్లాపాలెం వెళ్లే మామిడి కోళ్ల చానల్ గట్టు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావును ఆ రెండు గ్రామాల ప్రజలు కోరారు. ఈమేరకు శనివారం బందరులోని కొనకళ్ల స్వగృహంలో వినతిపత్రం అందజేశారు. సమ్మెట లక్ష్మీవెంకట సుబ్బారావు, ఊసా మోహనరావు, ఎస్.చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.



కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో వేదసభ నిర్వహిస్తున్న వేద పండితులు

వైభవంగా వేదసభ

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం రాత్రి కన్యకా పరమేశ్వరీ దేవస్థానం ఆవరణలో వేదపండితులు వేదసభను వైభవంగా నిర్వహించారు. పండితుల వేదఘోషతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. బందరు చుట్టుపక్కల ప్రాంతాల వేదపండితులు వేదసభలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కన్యకా పరమేశ్వరి, మెహర్‌బాబా రా అండ్ బాయిల్డ్ రైస్‌మిల్లులు సహకరించాయి. వేదపండితులను ఆలయ అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ, కార్యదర్శి మోటమర్రి బాబాప్రసాద్ తదితరులు సత్కరించారు.

నేడు 15 మంది ఉపాధ్యాయులకు సత్కారం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థి వికాస వాహిని ఆధ్వర్యంలో మహతి కళావేదికపై ఆదివారం సాయంత్రం 15 మంది ఉపాధ్యాయులను సత్కరిస్తామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వేములపల్లి కేశవరావు తెలిపారు. మండలి వెంకట కృష్ణారావు శత జయంతి విద్యాసేవ పురస్కారాన్ని అవనిగడ్డకు చెందిన విశ్రాంత తెలుగు పండితుడు గుడిసేవ విష్ణుప్రసాద్‌కు, మండలి వెంకటకృష్ణారావు శత జయంతి కళాసేవ పురస్కారాన్ని పిరాటి అర్చనకు అందించనున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు.

ఆటోడ్రైవర్లకు అండగా కూటమి ప్రభుత్వం

● ఆటోడ్రైవర్ల సేవలో ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్
● పెడన నియోజకవర్గంలో 1,375 మందికి రూ.2.62 కోట్లు లబ్ధి



ఆటోలో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్



ఆటోడ్రైవర్లకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో శనివారం ఆటోడ్రైవర్ల సేవలో నియోజకవర్గ స్థాయి పథకాన్ని ఆయన ప్రారంభించారు. పెడన నియోజకవర్గ పరిధిలో 1,375 మంది ఆటోడ్రైవర్లను ఎంపిక చేశామని, వీరి బ్యాంకు ఖాతాల్లో రూ. 2 కోట్ల 62 లక్షల 5వేలు జమ చేస్తామని తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల పథకానికి ఎంపిక కాని ఆటోడ్రైవర్లు మండల పరిషత్, రవాణా శాఖ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లో సంప్రదించాలని జడ్పీ సీఈవో కె. కన్నమనాయుడు సూచించారు. రూ. 15వేల ఆర్థిక సాయం అందిస్తున్నందుకు గాను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపి సన్మానించారు. ఎండీవో ఎ.అరుణకుమారి, కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్ అర్జా వెంకటనగేష్, టీడీపీ నాయకులు యక్కల శ్యామలయ్య, పోతన స్వామి, కూనపరెడ్డి వీరబాబు, వడుగు తులసీరావు, శీరం ప్రసాద్, బొర్రా కాశీ, గోపీ నాగబాబు, అబ్దుల్ ఖయూం, జనసేన నాయకులు మట్టా శివపావని, నాని, పంచకర్ల సురేష్, దాసరి సత్యనారాయణ, చంద్రమౌళి పాల్గొన్నారు.



కోడూరు ప్రధాన సెంటర్‌లో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ఆటోడ్రైవర్లు

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం

కోడూరు: ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని అమలు చేసినందుకు కృతజ్ఞతగా శనివారం మండల కూటమి నాయకుల ఆధ్వర్యంలో కోడూరు ప్రధాన సెంటర్‌లో ఆటో డ్రైవర్లు కేక్ కట్ చేశారు. సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కూటమి నాయకులు బండే శ్రీనివాసరావు, పూతబోయిన శ్రీనివాసరావు, కోట రాంబాబు, ఉల్లి శేషగిరిరావు, వేములపల్లి రాజేష్, తిరుపతి శ్రీనివాసరావు, కాగిత రామారావు, అద్దంకి పాండురంగారావు, జరుగు పోతురాజు, అప్పికట్ల రవీంద్ర, బొలిశెట్టి విఠల్‌రావు, తోట సాంబయ్య, కొప్పనాతి సత్యనారాయణ, కోట సుబ్బారావు పాల్గొన్నారు.




జెండా ఊపి ఆటో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



ఆటోలో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ నియోజకవర్గంలో 1,302 మందికి రూ.1.95 కోట్లు లబ్ధి

అవనిగడ్డ: 'ఆటో డ్రైవర్ల సేవలో పథకం ఆటో డ్రైవర్ల పాలిట వరం. ఈ పథకం కింద డ్రైవర్‌కు రూ.15 వేలు చొప్పున అవనిగడ్డ నియోజకవర్గంలో 1,302 మందికి రూ.1.95 కోట్ల మేర లబ్ధి చేకూరింది.' అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. శనివారం అవనిగడ్డలో ఆటోడ్రైవర్ల సేవలో పథకం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కాకీ చొక్కా ధరించి ఆటో డ్రైవర్లతో కలిసి బాలికల ఉన్నత పాఠశాల నుంచి రెవెన్యూ సమావేశ మందిరం వరకు ర్యాలీలో పాల్గొన్నారు. మండలి వెంకట్రామ్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.సాయిబాబు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, రవాణా శాఖాధికారి లోకనాథ ప్రసాద్, తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవోలు మరియాదేవి, సుధా ప్రవీణ్, స్వర్ణభారతి, వెంగళరావు, ఆనంద కుమారి, సీఐ యువకుమార్, సర్పంచ్‌లు కనగాల వెంకటేశ్వరరావు, దొప్పలపూడి గంగాభవాని, దిడ్ల జానకి రాంబాబు, డొక్కు నాగేశ్వరరావు, పైడిపాముల కృష్ణకుమారి పాల్గొన్నారు.





కోనేరుసెంటర్‌కు దగ్గరలో రోడ్డుపై గుంతలు

ప్రధాన రహదారులపై గుంతలు

● ప్రజల అవస్థలు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన రహదారులపై అక్కడక్కడా ఉన్న గుంతలతో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. కోనేరుసెంటర్ నుంచి విజయవాడకు వెళ్లే దారిలోనూ, రేవతీ సెంటర్‌లోనూ గుంతల కారణంగా ద్విచక్ర వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. నగరపాలక సంస్థ, ఆర్ అండ్ బీ అధికారులు గుంతలు పూడ్చాలని నగర ప్రజలు కోరుతున్నారు.

రీ సర్వే సద్వినియోగం చేసుకోండి



మేళ్లమర్తిలంకలో రీ సర్వే గ్రామసభ నిర్వహిస్తున్న తహసీల్దార్ హరనాథ్

మోపిదేవి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వే కార్యక్రమాన్ని ప్రతీ రైతు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ హరనాథ్ సూచించారు. మేళ్లమర్తిలంక పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం గ్రామసభను ఆయన నిర్వహించారు. ఈనెల 5వ తేదీ నుంచి గ్రామంలో రీసర్వే కార్యక్రమం ప్రారంభమవుతుందని, ప్రతీ రైతు తమ భూమి కొలతలు సిబ్బందితో కలిసి సరి చూసుకోవాలని ఆయన సూచించారు. సమస్యలు ఉంటే ధ్రువపత్రాలు సమర్పించి సరి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకట కృష్ణ, రీ సర్వే డీటీ ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు నడకుదిటి జనార్దరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు నాగినేని ధనుంజయరావు పాల్గొన్నారు.

ఎస్సీల సంక్షేమానికి కృషి చేయండి

● పెదపూడి విజయ్‌కుమార్‌తో గుమ్మడి విద్యాసాగర్

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఎస్సీల సంక్షేమం కోసం కృషి చేయాలని మాల సంక్షేమ సహకార ఆర్థిక సంస్థ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ పెదపూడి విజయ్‌కుమార్‌ను జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు గుమ్మడి విద్యాసాగర్ కోరారు. ఈ మేరకు శనివారం ఆర్ అండ్ బీ అతిథి గృహానికి వచ్చిన విజయ్‌కుమార్‌ను విద్యాసాగర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సీల హక్కుల పరిరక్షణపై ఆయనతో చర్చించారు. నిరుద్యోగ ఎస్సీ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని విజయ్‌కుమార్‌ను కోరారు.

ఘనంగా లోగిశెట్టి వెంకటస్వామి జన్మదినోత్సవం



కేకు కట్ చేస్తున్న టీడీపీ నగర అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నగర అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి జన్మదిన వేడుకలు శనివారం టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి కేక్ కట్ చేశారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, నాయకులు గొర్రెపాటి గోపీచంద్, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, బచ్చుల అనిల్‌కుమార్, లంకే నారాయణప్రసాద్, లంకే శేషగిరిరావు, జనసేన నాయకుడు గడ్డం రాజు, కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము పాల్గొన్నారు.ీడీపీ నగర అధ్యక్షుడు

ఎస్సీల అభ్యున్నతే ధ్యేయం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆత్మగౌరవం, సమానత్వం కోసం పనిచేస్తూ, సామాజిక వివక్ష నుంచి ఎస్సీలను కాపాడుకునేందుకు కేవీపీఎస్ ఆవిర్భవించిందని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బుర్రె రాజు అన్నారు. కేవీపీఎస్ 28వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఈడేపల్లిలో కేవీపీఎస్ మండల కార్యదర్శి పేటేటి రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లాలో కొన్ని మండలాల్లో కుల వివక్షతకు వ్యతిరేకంగా బాధితుల పక్షాన న్యాయం కోసం పోరాడుతున్నామని రాజు అన్నారు. ఎస్సీల స్మశాన వాటిక కోసం పోరాడి 1235 జీవోను సాధించామన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు మిరియాల ఆనంద్ బెనర్జీ, పట్టణ పౌర సంక్షేమ సంఘ నాయకులు కొడాలి శర్మ, సీఐటీయూ నాయకులు బి.సుబ్రహ్మణ్యం, సీహెచ్ జయరావు, టి.చంద్రపాల్ పాల్గొన్నారు.

పోటీ పరీక్షల
మెటీరియల్ అందజేత

నాగాయలంక, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన రాంక్ ఎడ్జ్ ఎకాడమీ డైరెక్టర్ ఎఎన్.ఎస్.శంకరరావు శనివారం నాగాయలంక కాలేజీలో జూనియర్, సీనియర్ ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు పోటీ పరీక్షల మెటీరియల్ అందించి, సంసిద్ధతపై అవగాహన కల్పించారు. ఇంటర్, కాప్‌సెట్, జేఈఈ పరీక్షలలో విజయం సాధించేందుకు మెళకువలు నేర్పారు.

ఎల్వోసీలు అందజేత

అవనిగడ్డ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గానికి చెందిన 23 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరయిన రూ.21.91 లక్షల ఎల్వోసీలను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అందజేశారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి పెనుమూడి సాయిబాబు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార ప్రదర్శన

ఘంటసాల, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రంలో సామాజిక విజ్ఞాన కళాశాల లాం, గుంటూరు విద్యార్థినులు పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథిగా జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ విచ్చేశారు. ప్రదర్శనను తిలకించి విద్యార్థులను అభినందించారు. గ్రామీణ మహిళలు, యువత పౌష్టికాహారంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రంలో చేపడుతున్న కార్యక్రమాలు రైతులకు ఉపయోగపడుతున్నాయని, శాస్త్రవేత్తలను అభినందించారు. కేవీకే ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి, సామాజిక విజ్ఞాన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చైతన్యకుమారి, అధ్యాపకులు నిర్మల, అపర్ణ, కేవీకే శాస్త్రవేత్తలు కృష్ణవేణి, రేవతి, వెంకటలక్ష్మి, నవీన్, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కోదండరామస్వామి ఆలయానికి కొత్త సొబగులు

● వేగంగా రాతి గాలి గోపుర నిర్మాణం



సుందరంగా తీర్చిదిద్దుతున్న బందరుకోట కోదండరామస్వామి ఆలయం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మంత్రి కొల్లు రవీంద్ర, ఆయన సతీమణి నీలిమ ఆధ్వర్యంలో బందరుకోటలోని కోదండ రామస్వామి ఆలయానికి కొత్త సొబగులు అద్దుతున్నారు. ఆలయానికి గాలి గోపురంతో పాటు ముందు భాగాన ఉన్న ప్రహరీని దేవతా ప్రతిమలతో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రముఖ శిల్పులు ఆలయాన్ని నల్లరాతి ప్రతిమలతో సుందరీకరిస్తున్నారు.